# మన జనప్రగతి
తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

సంపుటి : 6 సంచిక : 141 పేజీలు : 8 వెల : రూ.2/- బుధవారం 17 జూన్ 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




## ఫ్రాన్స్‌లో జీ-7 సదస్సు..
# పీఎం మోడీ హాజరు

**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 16 :**
ఫ్రాన్స్ వేదికగా 52వ శిఖరాగ్ర జీ7 సదస్సు జరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఆహ్వానం మేరకు పీఎం మోడీ సదురు సదస్సుకు హాజరైయ్యారు. ఆ తర్వాత ఎవియాన్-లెస్-బైన్స్ సరస్సు తీర ప్రాంతంలో పలువురు ప్రపంచ నాయకులతో కలిసి ప్రధాని మోడీ ఫొటోలు దిగారు. ప్రధాని మోడీతో పాటు యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోని, ఈజిప్ట అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా ఎల్-సిసి, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్, యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్, కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ, జపాన్ ప్రధానమంత్రి సనాయే టకైచి, యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా వంటి కీలక ప్రపంచ నాయకులు ఉన్నారు. జీ7 శిఖరాగ్ర సమావేశానికి భారతదేశం 13వ సారి ఈ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనగా, ప్రధానమంత్రి వరుసగా ఏడో ఈ ప్రపంచ వేదికపై పాల్గొంటున్నారు.

## అద్భుత నగరంగా
# అమరావతి నిర్మాణం

### - అంతర్జాతీయ మౌలిక వసతులతో తీర్చిదిద్దుతున్నాం

- పీపుల్ ఫస్ట్ మా విధానంలో నాలెడ్జ్ సిటీగా చేస్తున్నాం
- జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థల ఏర్పాటు
- క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలు
- లీడర్‌షిప్ ప్లీనరీ-2లో చంద్రబాబు ప్రసంగం





**అమరావతి,మన జనప్రగతి జూన్ 16 :**పీపుల్ ఫస్ట్ మా విధానమని... ఈక్విటీ, నేచర్, ఆపర్చునిటీ, లివబుల్ సిటీగా అమరావతి ఉంటుందని సీఎం చంద్రబాబు తెలిపారు. అంతర్జాతీయ మౌలిక వసతులతో, అవకాశాల వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. సింగపూర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో పాల్గొన్న సీఎం.. లీడర్‌షిప్ ప్లీనరీ-2లో 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై ప్రసంగించారు. అమరావతిని నాలెడ్జ్ సిటీగా చేస్తున్నామని.. జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలను మిగతా2లో...



2లో

### ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి
# కట్టుబడి ఉంది

- వాజ్‌పేయ్ పార్కులో స్వచ్ఛభారత్‌లో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

## జనసేనల్లో జాయినింగ్స్
# కమిటీ ఏర్పాటు


● పార్టీలో చేరేవారి కోసం 14మందితో కమిటీ ● పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వెల్లడి



**అమరావతి,మన జనప్రగతి జూన్ 16 :**జనసేన పార్టీలో చేరికల సమన్వయానికి జాయినింగ్స్ కమిటీని నియమించినట్లు పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. జనసేన పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్న ఇతర పార్టీల నేతలు, విద్యావంతులు, సామాజికవేత్తలు, తటస్థులను పార్టీలోకి ఆహ్వానించేందుకు ప్రత్యేకంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 14 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ చేరికలను సమన్వయం చేస్తుందన్నారు. ఢిల్లీ పర్యటన మిగతా2లో...

## దళిత మహిళా ప్రజాప్రతినిధిపై
# ఇంత అక్కసా..?

- ● గుడివాడ అమర్నాథ్ తీరుపై మండిపడ్డ లోకేశ్
- ● రెండేళ్ల విజయాలపై 25 నుంచి ఇంటింటికీ తెలుగుదేశం




**అమరావతి,మన జనప్రగతి జూన్ 16 :** హోంమంత్రి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనితపై అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు వైసీపీ నేతల అసలు స్వరూపాన్ని బయటపెట్టాయని మిగతా2లో...

## వైసిపి ఓట్లను తొలగించే
# కుట్రలో చంద్రబాబు


- సర్ ప్రక్రియపై నాలుగు వారాలు అప్రమత్తంగా ఉండాలి
- ఫిర్యాదులు వస్తే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి
- పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య నాయకులతో సమీక్షలో జగన్



**అమరావతి,మన జనప్రగతి జూన్ 16 :** రాబోయే నాలుగు వారాలు అత్యంత కీలకమని పేర్కొంటూ సర్ ప్రక్రియ పట్ల పార్టీ శ్రేణులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించారు. వైసీపీకి అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని జగన్ ఆరోపించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు, బూత్ స్థాయి నాయకులు నిర్లక్ష్యం చేయకుండా ప్రతిరోజూ పరిస్థితులను మిగతా2లో...

## హార్మూజ్ ఇక టోల్ ఫ్రీ
# ఏరియా

- నౌకలు స్వేచ్ఛగా వెళ్లేందుకు అనుమతి
- శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుంది
- ఇరాన్‌పై కుదిరిన ఒప్పందాన్ని త్వరలో వెల్లడిస్తా..
- జీ 7 సదస్సులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన



**ప్యారిస్,మన జనప్రగతి జూన్ 16 :**ఫ్రాన్స్‌లో జీ 7 సదస్సు వేదికగా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. హోర్ముజ్ శాశ్వతంగా టోల్ రహితంగా ఉంటుందని వెల్లడించారు. సమ్మిట్‌ను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగం చేశారు. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుందని.. ఇకపై అది శాశ్వతంగా టోల్ ఫ్రీగా అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. అలాగే ఇరాన్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తానని.. దీనిపై ప్రత్యేకంగా మీడియా సమావేశం కూడా నిర్వహిస్తానని మిగతా2లో...

## రొయ్యల ఫీడ్ ధరలు
# పెంచేది లేదు

- అనుమతి లేకుండా పెంచితే కఠిన చర్యలు
- గొడ్డలిపార్టీ ప్రతిదీ రాజకీయం చేస్తోందని ఆగ్రహం
- ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు




2లో

## ఆర్థిక సంక్షోభంలో
# కూరుకున్న తమిళనాడు

రాష్ట్ర ఆర్థిక భారం రూ.13.18 లక్షల కోట్లకు చేరిక శ్వేతపత్రం విడుదల చేసిన సిఎం విజయ్



**చెన్నై,మన జనప్రగతి జూన్ 16 :** తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్ర శ్వేతపత్రాన్ని మంగళవారంనాడు విడుదల చేసింది. డీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, ఖజానా ఖాళీ అయిందని ఆ శ్వేతపత్రంలో పేర్కొంది. రాష్ట్ర మొత్తం ఆర్థిక భారం రూ.13.18 లక్షల కోట్లకు చేరిందని తెలిపింది. ప్రత్యక్ష రుణభారం దాదాపు రూ.10 లక్షల కోట్లుగా పేర్కొంది. ఎంకే స్టాలిన్ సారథ్యంలోని గత డీఎంకే ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్ర రుణ భారం మిగతా2లో...

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా పంతు | అభివృద్ధి మా లక్ష్యం

17 - 06 - 2026

# అద్భుత నగరంగా అమరావతి నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకువస్తున్నామని అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతి నిర్మాణం అవుతోందన్నారు. అమరావతిని సందర్శించి.. సరికొత్త ఆలోచనలతో అవకాశాలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 25 ఏళ్ల క్రితం ఐటీ గురించి మాట్లాడానని... ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్‌తో ఈరోజు తెలుగువాళ్లు తలసరి ఆదాయంలో ముందున్నారని తెలిపారు. ఇప్పుడు ఏఐ వచ్చిందన్నారు. నాడు సైబరాబాద్‌ను అభివృద్ధి చేశామని... నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయవనరుగా మారిందని చెప్పారు. రాష్ట్ర విభజనతో మరో నగరాన్ని నిర్మించే అవకాశం వచ్చిందని... అమరావతిని గ్రీన్ ఫీల్డ్ సిటీగా నిర్మిస్తున్నామని వెల్లడించారు. కృష్ణానది, ఇన్నర్ - ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ బ్రిడ్జిలతో అద్భుతంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని వివరించారు. స్పోర్ట్స్, ఫైనాన్సియల్, నాలెడ్జ్, జస్టిస్, టూరిజం, హెల్త్, మీడియా వంటి కాన్సెప్ట్ తీసుకున్నామన్నారు. ఒకే ఒక్క పిలుపుతో రాజధాని కోసం రైతులు 35 వేల ఎకరాలను అప్పగించారని... వాటిలో కొంత భాగాన్ని అభివృద్ధి చేసి రైతులకు తిరిగి ప్లాట్లు ఇస్తున్నామన్నారు. 21 కి.మీ పొడవునా వాటర్ ఫ్రంట్ నగరంగా అమరావతి ఉంటుందని తెలిపారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్, అండర్ గ్రౌండ్ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. సైబరాబాద్‌లో నాడు ఎకరం రూ.2 లక్షలు ఉంటే... నేడు రూ.200 కోట్లకు పెరిగిందన్నారు. అభివృద్ధి జరిగితే సంపద సృష్టి సాధ్యమవుతుందనేందుకు సైబరాబాద్ నిదర్శనమని తెలిపారు.

# దళిత మహిళా ప్రజాప్రతినిధిపై ఇంత అక్కసా..?

(మొదటి పేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. మంగళవారం అమరావతి వేదికగా మంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో పాలన, అభివృద్ధి, శాంతిభద్రతలపై సమాధానాలు లేక వైసీపీ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఆగ్రహించారు. మహిళా నేత, దళిత ప్రజాప్రతినిధిని లక్ష్యంగా చేసుకోవడం వైసీపీ నీచ రాజకీయ సంస్కృతికి నిదర్శనమని లోకేశ్ మండిపడ్డారు. అనిత రాజకీయ ప్రస్థానం, కష్టపడి ఎదిగిన మహిళా వ్యక్తిత్వానికి నిదర్శనమని లోకేశ్ ప్రశంసించారు. అనితకు, మహిళలకు, దళిత సమాజానికి వైసీపీ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని మంత్రి లోకేశ్ డిమాండ్ చేశారు. ఇదిలావుంటలే లోకేశ్ టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాష్ట్ర, జాతీయ కార్యవర్గంతో మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కూటమి పాలన రెండేళ్ల విజయాలపై ఈ నెల 25వ తేదీ నుంచి ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ నేతలు వెళ్లాలని పిలుపునిచ్చారు. మొత్తం 45 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. సుమారు రెండు గంటల పాటు ఈ సమావేశం కొనసాగింది. అన్ని నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లాలని యువనేత దిశానిర్దేశర చేశారు. తమ ఇబ్బందులను కొంతమంది ఎమ్మెల్యేలు లోకేశ్‌కి వివరించారు. అర్హులైన వారు కొత్త పెన్షన్లు అడుగుతున్నారని తెలిపారు. గ్రామానికి వెళ్లిన వెంటనే చిన్న చిన్న పనులు అడుగుతున్నారని, దీనికి కొంత నిధులు ఇవ్వాలని కోరారు. ఈ సమస్య తనకు కూడా ఉందని.. ఏపీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకోవాలని ఎమ్మెల్యేలకు లోకేశ్ సూచించారు. అన్ని విషయాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి 45 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని యువనేత మార్గనిర్దేశం చేశారు. వారానికి కనీసం నాలుగు రోజులైనా ఈ కార్యక్రమం నిర్వహించాలని లోకేశ్ ఆదేశించారు.

# వైసిపి ఓట్లను తొలగించే కుట్రలో చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షించాలని ఆదేశించారు. ఓట్ల తొలగింపుకు సంబంధించిన ఫిర్యాదులు వస్తే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, సమస్య పరిష్కారం కాకపోతే పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారం అందించాలని సూచించారు. తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రత్యేకంగా చర్చించిన జగన్, ఒక్కసారి ఓటు తొలగించబడితే తిరిగి జాబితాలో చేర్పించడం కష్టమవుతుందని పేర్కొన్న జగన్, ప్రతి ఓటును కాపాడుకోవడం పార్టీ శ్రేణుల బాధ్యత అని అన్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి అలసత్వానికి తావివ్వకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. అధికార దుర్వినియోగంతో ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రతి బూత్‌లో కనీసం 50 ఓట్లు తొలగించడమే కూటమి లక్ష్యంగా పనిచేస్తోందని ఆరోపించిన జగన్, వివిధ గిమ్మిక్కుల ద్వారా ఓట్ల తొలగింపునకు చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బూత్ లెవల్ ఏజెంట్లు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియపై రోజువారీ పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఓటును రక్షించేందుకు పార్టీ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్..

# రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు

## • మెడికల్ రిపోర్టులను సమర్పించాలని హైకోర్టు ఆదేశం



**అమరావతి,మన జనప్రగతి జూన్ 16 :** వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎంపీ, ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి తెలుగుదేశం ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు సంబంధించిన కస్టోడియల్ టార్చర్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మంగళవారం ఈకేసుపై విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని మెడికల్ రిపోర్టులను తమ ముందుంచాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన మెడికల్ బోర్డు నివేదికలు, వైద్య పరీక్షల పూర్తి రికార్డులు, ఇతర సంబంధిత పత్రాలను కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. సీఐడీ అధికారులు తనను కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారని రఘురామ గతంలో ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై న్యాయస్థానం ఆదేశాల మేరకు మెడికల్ బోర్డు, వివిధ విభాగాధిపతులు నిర్వహించిన వైద్య పరీక్షల నివేదికలను తారుమారు చేయడానికి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రయత్నిస్తున్నారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే, తప్పుడు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మెడికల్ బోర్డును రక్షించేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రయత్నిస్తున్నారని కూడా పిటిషన్‌లో రఘురామ ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో గతంలోనే సంబంధిత మెడికల్ రిపోర్టులను భద్రపరచాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం ఆ రికార్డులన్నింటినీ న్యాయస్థానం ముందుంచాలని మరోసారి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. అప్పటిలోగా అన్ని వైద్య రికార్డులు, మెడికల్ బోర్డు నివేదికలు, సంబంధిత పత్రాలను సమర్పించాలని అధికారులను ఆదేశించింది. ఈ కేసులో మెడికల్ ఆధారాలు కీలకంగా మారనున్న నేపథ్యంలో ఏపీ హైకోర్టు తాజా ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# సీబీఎన్ ఎట్ 361 డిగ్రీస్.. పాలీమ్యాథ్ పుస్తకం

## • సింగపూర్‌లో ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు




**అమరావతి,మన జనప్రగతి జూన్ 16 :** సీబీఎన్ 361 డిగ్రీస్.. పాలీమ్యాథ్ పుస్తకాన్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్‌లో ఆవిష్కరించారు. కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పుస్తకం తొలి ప్రతులను సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులకు అందించారు. ఈ పుస్తకాన్ని 'రేపటి కోసం' దినపత్రిక చీఫ్ ఎడిటర్ శాఖమూరు శ్రీనివాస ప్రసాద్ రచించారు. దీనిని విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ సత్యనారాయణ ఆంగ్లంలో అనువదించారు. దార్శనిక నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ సందర్భాల్లో తీసుకున్న నిర్ణయాలను విశ్లేషిస్తూ ఈ పుస్తకాన్ని రచించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పాలకులుగా గుర్తింపు ఉన్న సింగపూర్, న్యూజిల్యాండ్ మాజీ ప్రధానులు లీ క్వాన్ యూ, జేసిందా ఆర్డ్నాడ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ నేతల తరహాలోనే సీఎం చంద్రబాబు నిర్ణయాలు తీసుకొంటున్నారని.. ఏపీ అభివృద్ధికి విజన్‌ల రూపకల్పనతో పాటు అమరావతి రాజధాని నిర్మాణంలో తీసుకుంటోన్న శ్రద్ధ దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని రచయిత వివరించారు.

ఏపీ రెరా మాజీ చైర్మన్ రామనాథ్ వివిధ సందర్భాల్లో వ్యక్తపరిచిన అభిప్రాయాల్లో బాహ్య ప్రపంచానికి తెలియని అంశాలను సీబీఎన్‌అ361 డిగ్రీస్ పుస్తకంలో ఆవిష్కరించినట్టు తెలిపారు. సింగపూర్ ప్రభుత్వ గుర్తింపు పొందిన కాకతీయ కల్చరల్ అసోసియేషన్.. ముఖ్యమంత్రిని గ్లోబల్ పాలీమ్యాథ్ అవార్డుతో సత్కరించింది. సింగపూర్ రూపకర్త లీ క్వాన్ యూ శతజయంతిని పురస్కరించుకుని విడుదల చేసిన వెండి నాణెళిన్ని సీఎం చంద్రబాబుకు అసోసియేషన్ ప్రతినిధులు బహూకరించారు. త్వరలోనే ఈ పుస్తకం తెలుగు, హిందీ సహా వివిధ భారతీయ భాషల్లో విడుదల చేయనున్నట్టు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెరా మాజీ చైర్మన్ రామనాథ్, కేవీ సత్యనారాయణ, శంకర ప్రసాద్, సింగపూర్‌లోని తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉంది

**విజయవాడ,మన జనప్రగతి జూన్ 16 :** కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఒక రోజు పర్యటనలో భాగంగా విజయవాడ చేరుకున్న ఆయన.. నగరంలోని వాజ్‌పేయి పార్కులో స్వచ్ఛభారత్‌లో భాగంగా చీపురు పట్టి చెత్త ఊడ్చారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి పార్కులో మొక్కలు నాటారు. అనంతరం పార్క్‌కు వచ్చిన వాకర్స్‌తో ముచ్చటించారు. దేశంలో అత్యధిక కాలం సేవలందించిన ప్రధానిగా.. నరేంద్ర మోదీ చరిత్రలో నిలిచిపోయారన్నారు. 2014కు ముందు భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత క్షీణ దశలో ఉందని.. మోదీ ప్రధాని అయ్యాక అత్యంత వేగంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపాంతరం చెందిందని పేర్కొన్నారు. రైల్వే ఎలక్ట్రిఫికేషన్ జరిగిన రెండో దేశం భారత్ అని వివరించారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు 8 రెట్లు పెరిగాయి. అమరావతి కోసం హడ్కో నుంచీ రూ.11వేల కోట్లు ఇచ్చామన్న జోషి.. అమరావతి కనెక్ట్ చేస్తూ ప్రత్యేక రైల్వే లైన్ కోసం నిధులు సమకూర్చినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర అబివృద్ధి కోసం చంద్రబాబు, పవన్, మాధవ్ కలిసి బాగా పని చేస్తున్నారని ప్రహ్లాద్ జోషి కితాబిచ్చారు. రాజధాని అమరావతికి రోడ్, రైల్వే కనెక్టివిటీ పెంచుతున్నామని వెల్లడించారు.అమరావతి అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు.

# జనసేనలో జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ఈ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీలో చేరికలపై దిశానిర్దేశర చేయనున్నట్లు పవన్ చెప్పారు. ఆంధప్రదేశ్ తరహాలోనే తెలంగాణలోనూ జాయినింగ్స్ కమిటీ నియామకానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కమిటీలో ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంతం నానాజీ, ఎంపీ లింగమనేని రమేశ్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, సామినేని ఉదయభాను, పార్టీ సీనియర్ నేతలు కొటికలపూడి చినబాబు, డా.హరిప్రసాద్, డా.పెదపూడి విజయ్ కుమార్, కొరికాన రవికుమార్, వంపూరు గంగులయ్య, టీసీ వరుణ్, ఆరణి మదన్ సభ్యులుగా ఉంటారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# రొయ్యల ఫీడ్ ధరలు పెంచేది లేదు

**పార్వతీపురం,మన జనప్రగతి జూన్ 16 :** అనుమతి లేకుండా ఫీడ్ ధరలు పెంచితే ఊరుకునేది లేదని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. అనుమతి లేకుండా ఫీడ్ ధరలు పెంచడాన్ని నిలిపివేశామని స్పష్టం చేశారు. మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. ప్రతి చిన్న అంశాన్ని రాజకీయం చేయడం గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి నైజమని మంత్రి ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో విద్యుత్ సబ్సిడీ కేవలం రూ.750 కోట్లు ఇచ్చా రని అన్నారు. కూటమి ప్రభుత్వం రొయ్యల రైతులకు ఏడాదికి రూ.1,170 కోట్ల విద్యుత్ సబ్సిడీ ఇస్తుందని స్పష్టం చేశారు. సోయా బీన్, ఫిష్ ఆయిల్ ధరలు పెరిగిన మాట వాస్తవమేనని చెప్పుకొచ్చారు. ముడి పదార్థాల ధరల భారం రైతులపై ఒక్కసారిగా మోపడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం, అధికారులు, రైతులు, తయారీదారులతో కూడిన కమిటీ ద్వారానే ఇకపై ధరల నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు. రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణెళి తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. జోన్, నాన్-జోన్, 10 ఎకరాల పరిమితి నిబంధనలని తొలగించామని తెలిపారు. ప్రతి ఆక్వా రైతుకూ యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. గతంలో ల్యాబ్‌ల పేరుతో ప్రచారం తప్ప క్షేత్రస్థాయిలో సౌకర్యాలు లేవని ప్రస్తావించారు. రాష్ట్రంలోని ఏ గ్రామానికైనా వచ్చి వాస్తవాలు పరిశీలించాలని గొడ్డలి పార్టీ అధ్యక్షుడుకి సవాల్ విసిరారు. ఫీడ్ ధరల నియంత్రణకు దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేశామని మంత్రి వివరించారు.

# ఆర్థిక సంక్షోభంలో కూరుకున్న తమిళనాడు

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు రెట్టింపయిందని, రాష్ట్రంలో పుట్టే ప్రతి చిన్నారిపై రూ.1.28 లక్షల అప్పుభారం పడుతోందని ఆ నివేదిక పేర్కొంది. రాష్ట్ర ఆర్థిక లోటు 78,324 కోట్లుగా నమోదైనట్టు తెలిపింది. ప్రభుత్వానికి వచ్చే ప్రతి రూపాయిలో 22.8 పైసలు అప్పులపై వడ్డీ చెల్లింపులకే పోతోందని శ్వేతపత్రం తెలిపింది. జీఎస్టీ ఆదాయ వృద్ధి కేవలం 5.45 శాతంగా ఉందని, ఆదాయానికి, అప్పులకు పొంతనే ఉండటం లేదని పేర్కొంది.

# హార్మూజ్ ఇక టోల్ ఫ్రీ ఏరియా

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు.ఇరాన్‌తో కుదిరిన ఈ ఒప్పందాన్ని అమెరికా కాంగ్రెస్ పరిశీలనకు పంపనున్నట్లు ట్రంప్ చెప్పారు. ఈ ఒప్పందంలో ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోదని స్పష్టంగా పేర్కొన్నామని వెల్లడించారు. ఇరాన్‌తో చర్చల తొలి దశ విజయవంతంగా పూర్ఖైందని.. రెండో దశ చర్చలు మరింత వేగంగా పూర్తవు తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన పూర్తి పాఠ్యాన్ని అధికారిక కార్యక్రమంలో విడుదల చేస్తానని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల కుదిరిన శాంతి ఒప్పందం ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి పునఃప్రారంభం ప్రపంచ ఇంధన మార్కెట్లకు ఊరటనివ్వనుంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ కీలక ప్రకటన చేసింది. అమెరికాతో ఒప్పందం అనంతరం ఇరాన్‌కు చెందిన చమురు ట్యాంకర్లు, ఇతర వాణిజ్య నౌకలు మళ్లీ సముద్ర మార్గంలో ప్రయాణాలు ప్రారంభించాయని వెల్లడించింది. అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనం సడలింపుకు ఇది సంకేతమని పేర్కొంది. ప్రస్తుతం మూడు ఇరానియన్ చమురు ట్యాంకర్లు ఉత్తర హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తుండగా.. మరో రెండు నౌకలు అవసరమైన సరుకులు, పశువుల మేతతో దక్షిణ ఇరాన్ నౌకాశ్రయాల వైపు వెళ్తున్నాయని ఇరాన్ మీడియా తెలిపింది. ఏప్రిల్ 13 నుంచి అమల్లో ఉన్న అమెరికా నౌకాదళ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ నౌకల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అయితే తాజా ఒప్పందంతో ఆ దిగ్బంధనాన్ని ఎత్తివేసే ప్రక్రియ అమలులోకి వచ్చిందని ఇరాన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామం ప్రపంచ చమురు సరఫరా వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఆక్వాఫీడ్ ధరలు తగ్గించాల్సిందే..

## - చంద్రబాబు సర్కార్‌కు వైఎస్ జగన్ అల్టిమేటం



**అమరావతి,మన జనప్రగతి జూన్ 16 :** ఆక్వాఫీడ్ ధరలు తగ్గించాల్సిందేనని లేదంటే ఆక్వా రైతులతో కలిసి ఉద్యమిస్తామని ఏపీలోని కూటమి ప్రభుత్వానికి మాజీ సీఎం వైఎస్ జగన్ హెచ్చరించారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యాలయంలో జగన్‌తో ఆక్వా రైతులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ..వైసీపీ హయాంలో ఆక్వా రైతుల కోసం ఎంతో కృషి చేశామన్నారు.కానీ చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. నేడు రైతులు ఏపీలో దర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ఆక్వాఫీడ్ ధరల్ని ఈ నెలాఖరులోగా తగ్గించాలని, లేదంటే రైతుల తరపున పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులకు వైసీపీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

# ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**- సింహాద్రిపురం తహశీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓల సమావేశం**



**సింహాద్రిపురం మన జనప్రగతి జూన్ 16 :-** సింహాద్రిపురం మండల తహశీల్దార్ (ఎంఆర్ఓ) కార్యాలయంలో మంగళవారం బూత్ లెవెల్ ఆఫీసర్ల (బీఎల్ఓ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ సమ్మరీ రివిజన్) కార్యక్రమం, ఇంటింటి ఓటర్ల సర్వే నిర్వహణపై సమగ్రంగా చర్చించారు.ఈ సమావేశానికి మండల కూటమి నాయకులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. క్షేత్రస్థాయిలో చేపడుతున్న ఇంటింటి ఓటర్ల సర్వే, ఓటర్ల వివరాల వెరిఫికేషన్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని వారు అధికారులను కోరారు.ముఖ్యంగా బోగస్ ఓట్ల తొలగింపు, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, ఓటరు వివరాల సవరణ వంటి అంశాల్లో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని కోరారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా కీలకమైనదని, ప్రత్యేక సవరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులకు పూర్తి సహకారం అందిస్తామని కూటమి నాయకులు తెలిపారు. అలాగే క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పలువురు కూటమి నాయకులు, బీఎల్ఓలు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి ఎమ్మెల్యే వసంత పెద్దపీట

**- వసంతకు కృతజ్ఞతలు తెలిపిన ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ( ఏపీఎంపీఏ) సభ్యులు**




**మైలవరం మన జనప్రగతి జూన్ 16:-** మైలవరం నియోజకవర్గంలో ఉన్న జర్నలిస్టులందరికీ హెల్త్ స్కీమ్ కట్టిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఏపీఎంపీఏ) సభ్యులు మంగళవారం మైలవరం శాసనసభ్యుని వారి కార్యాలయంలో ఎమ్మెల్యే వసంతను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఒకొక్క జర్నలిస్టుకు హెల్త్ స్కీం నిమిత్తం రూ.1250 చొప్పున సుమారు 150 మందికి పైగా హెల్త్ స్కీం నిమిత్తం ఆర్థిక తోడ్పాటును ఎమ్మెల్యే వసంత కల్పించడం జరిగింది. వచ్చే ఏడాది కూడా హెల్త్ స్కీం కోసం ఆయన ఆర్థిక తోడ్పాటును కల్పిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. మైలవరం ఎమ్మెల్యేగా వచ్చినప్పటి నుంచి జర్నలిస్టుల స్థలాల విషయంలో కరోనా సమయంలో, వివిధ రూపాలలో అనేక సహాయాలు తోడ్పాటును అందిస్తూ వసంత జర్నలిస్టుల పట్ల అంకితభావంతో పనిచేస్తున్నారని యూనియన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, మైలవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బొడ్డు విజయ్ బాబు, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి మల్లెల శ్రీనివాసరావు, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పామర్తి సత్య, జిల్లా జాయింట్ సెక్రటరీ మన్నే సాంబశివరావు, ప్రెస్ క్లబ్ కోశాధికారి మల్లాది తిరుపతిరావు, మాజీ అధ్యక్షుడు గుంజి నాగరాజు పాల్గొన్నారు.

# ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల పరిశీలన

**చింతల జూటూరులో ఎస్ఐఆర్-2026 నిర్వహణ**

**ఓటరు జాబితా లోపాల సవరణకు చర్యలు**

**అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి:అధికారులు**



**వేముల మన జనప్రగతి జూన్ 16:-**వేముల మండల పరిధిలోని చింతల జూటూరు గ్రామంలో మంగళవారం ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఏలు అన్నారెడ్డి మురళీమోహన్‌రెడ్డి, ఎద్దుల చలమారెడ్డి, వీఆర్వో ఓబులేసు పాల్గొని ఓటర్ల జాబితాను పరిశీలించి, ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, పేర్ల సవరణలు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఓటరు జాబితాలో ఏవైనా తప్పులు లేదా లోపాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని కోరారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావడం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పడాలని వారు పేర్కొన్నారు. గ్రామస్థులు, యువకులు, మహిళలు పాల్గొని తమ ఓటరు వివరాలను పరిశీలించుకున్నారు.

# జిల్లాలో యోగాంధ్రకు విస్తృత ఏర్పాట్లు

**5.50 లక్షల మందితో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ లక్ష్యం: సెట్కూర్ సీఈవో వేణుగోపాల్**





**కర్నూలు మన జనప్రగతి జూన్ 16:-** జిల్లాలో జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సెట్కూర్ సీఈవో వేణుగోపాల్ తెలిపారు.జిల్లావ్యాప్తంగా 5.50 లక్షల మంది పాల్గొనేలా "యోగాంధ్ర" కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు.మంగళవారం కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టు శ్రీ రూపాల సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే 5.50 లక్షల మంది నమోదు చేసుకున్నారని, కార్యక్రమం విజయవంతం కోసం 11,500 మంది మాస్టర్ ట్రైనర్లకు ప్రత్యేక శిక్షణ అందించి వివిధ ప్రాంతాల్లో ప్రజలకు యోగా సాధనపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.పర్యాటక యోగా కార్యక్రమాల కింద రాక్ గార్డెన్, కొండారెడ్డి బురుజు వంటి ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించామని, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఊరుకుంద, మంత్రాలయం, పెరవల్లి, కల్వబుగ్గ, జగన్నాథగట్టు వంటి పుణ్యక్షేత్రాల్లో కూడా ప్రత్యేక యోగా శిబిరాలు కొనసాగుతున్నాయని చెప్పారు.ఈ నెల 18న ఎస్‌సీపీ గ్రౌండ్‌లో వెయ్యి మంది పారిశుద్ధ్య కార్మికులతో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యోగాపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామ, వార్డు, మండల, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని వేణుగోపాల్ పేర్కొన్నారు. తహసీల్దార్ రమేష్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయంలో మిశ్రమ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ విధానాన్ని ప్రోత్సహించాలి: కలెక్టర్ డా.ఏ.సిరి**

**పశుపోషణ,మేత పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం**





**కర్నూలు మన జనప్రగతి జూన్ 16:-**వ్యవసాయంలో మిశ్రమ పంటల సాగుకు ప్రాధాన్యత కల్పించి రైతులకు స్థిరమైన ఆదాయం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.జిల్లాలో పంటల వైవిధ్యీకరణ, నేల సారవంతం, రైతుల ఆదాయ వృద్ధి లక్ష్యాల సాధనకు మిశ్రమ పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి రైతు ఒక ప్రధాన పంటతో పాటు 5 నుంచి 6 అనుబంధ పంటలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని, తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే, కరువును తట్టుకునే పంటలను ఎంపిక చేయాలని తెలిపారు.పశుపోషణ వల్ల కలిగే ప్రయోజనాలు, అదనపు ఆదాయ అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించిన కలెక్టర్, జిల్లాలో 10 వేల పశుసంపద యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అలాగే 9,400 ఎకరాల్లో మేత పంటల సాగు లక్ష్యాన్ని సాధించేందుకు బీడు భూములను వినియోగించి ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు.ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే, కరువును తట్టుకునే పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం పీఎమ్‌డీఎస్ కింద 92 వేల ఎకరాల లక్ష్యం ఉన్నప్పటికీ, జిల్లా లక్ష్యం 1.35 లక్షల ఎకరాలని పేర్కొంటూ ఆ దిశగా కృషి చేయాలని తెలిపారు.ఇటీవల గోరుచిక్కుడు,బెండకాయ, ఆకుకూరలు, కాకరకాయలను మిశ్రమ పద్ధతిలో సాగు చేసి మూడు నెలల్లో రూ.1.20 లక్షల నికర ఆదాయం పొందిన రైతు నమూనాను ఇతర రైతులకు పరిచయం చేయాలని సూచించారు. అలాగే ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియను సక్రమంగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి,న్యాచురల్ ఫార్మింగ్ అధికారి మాధురి,మార్క్‌ఫెడ్ డీఎం రాజు,మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

**స్మార్ట్ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత సమర్ధవంతంగా**

# సేవలు అందించేందుకు కృషి చేయాలి

**రౌడీలు, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం**

**ప్రొద్దుటూరు, రాజంపేట సబ్ డివిజన్ ల నేర సమీక్షా సమావేశంలో**

**కడప జిల్లా ఎస్.పి షెల్కేనచికేత్ విశ్వనాథ్ దిశానిర్దేశం**





**కడప మన జనప్రగతి జూన్ 16: -** స్మార్ట్ పోలీసింగ్ ఇండికేటర్స్ అయిన సిఈఆర్ఐ, ఈ-సాక్ష్య, సి.సి.టి.ఎన్.ఎస్, ఈ- సమ్మన్స్, ఈ-ప్రాసిక్యూషన్స్ తదితర మాడ్యూల్స్ పై పట్టు పెంచుకుని ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని వై.ఎస్.ఆర్ కడప జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రొద్దుటూరు, రాజంపేట సబ్ డివిజన్ ల పోలీస్ అధికారులతో నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి జిల్లా ఎస్.పీ స్మార్ట్ పోలీసింగ్ మాడ్యూళ్ళపై సమీక్ష నిర్వహించారు. ఈ- ఆఫీస్ ను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని ఎస్.పి ఆదేశించారు. డ్రోన్ టెక్నాలజీ ని వినియోగించి నేరాలకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. బాధితు లు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను త్వరితగతిన రికవరీ చేయాలనీ ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ ను మరింత విస్తృతం చేయాలని, క్షేత్ర స్థాయిలో తిరుగు తూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆర్ అండ్ బి ఇతర శాఖల సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మలుపుల వద్ద అతి వేగం, వేగ నియంత్రణ లేకపోవడం వల్ల అధికంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని జిల్లా ఎస్.పి ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిరంతరం నిఘా ఉంచాలన్నారు. రౌడీ లపై ఉక్కుపాదం మోపాలని, రౌడీ షీటర్ల కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. క్రమం తప్పకుండా రౌడీలకు కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పదే పదే నేరాలకు పాల్పడే వారిపై పిడి యాక్ట్ తో పాటు జిల్లా బహిష్కరణ కు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లాడ్జి లలో నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని, విద్యాసంస్థల వద్ద ఈవ్ టీజింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిస్సింగ్ కేసులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, త్వరితగతిన ఆచూకీ కనుగొని వారి కుటుంబ సభ్యుల కు అప్పగించాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను సమీక్షించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేసారు.. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దొంగతనాలు జరగకుండా రాత్రి, పగలు గస్తీ ముమ్మ రంగా చేయాలని ఆదేశించారు. గతంలో జరిగి న ప్రాపర్టీ నేరాలలో సొత్తు రికవరీ చేయాలని, రికవరీ శాతం పెంచాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. మహిళలపై నేరాలు జరగకుండా శక్తి టీముల నిఘా పెంచాలని ఆదేశించారు.సమావేశంలో ప్రొద్దుటూరు ఏ.ఎస్.పీ యు. విభు కృష్ణ, రాజంపేట ఏ.ఎస్.పీ మనోజ్ రామనాథ్ హెగ్డే, ప్రొద్దుటూరు, రాజంపేట సబ్ డివిజన్లలోని సి.ఐ లు, ఎస్.ఐ లు పాల్గొన్నారు.

# హోంమంత్రి అనితపై వ్యాఖ్యలు సిగ్గుచేటు: కొమరా వెంకట నరసయ్య



**ఒంటిమిట్ట మన జనప్రగతి జూన్ 16:-**రాష్ట్ర హోంమంత్రి శ్రీమతి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం ఆమోదించదని రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య విమర్శించారు. మంగళవారం ఒంటిమిట్టలో విలేకరులతో మాట్లాడుతూ, ప్రజలు వైఎస్సార్‌సీపీని ఇప్పటికే తిరస్కరించినప్పటికీ ఆ పార్టీ నాయకులకు ఇంకా జ్ఞానోదయం కలగలేదన్నారు. దళిత మహిళ అయిన హోంమంత్రి వస్త్రధారణపై చేసిన వ్యాఖ్యలు మహిళలను తీవ్రంగా ఆవేదనకు గురిచేశాయని పేర్కొన్నారు. ఇతరుల కుటుంబ సభ్యులపై ఇలాంటి వ్యాఖ్యలు వస్తే వైఎస్సార్‌సీపీ నాయకులు సహించరని, అదే విషయాన్ని గుర్తుంచుకుని మాట్లాడాలని సూచించారు. గుడివాడ అమర్నాథ్ వెంటనే హోంమంత్రి అనితకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
17 - 06 - 2026

## జూన్ 30, జూలై 1న ప్రొద్దుటూరుకు శృంగేరి పీఠాధిపతి రాక..



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 16:-** ప్రొద్దుటూరు పట్టణంలోని గంగమ్మ దేవాలయం వీధి (పప్పుల బజార్)లో ఉన్న శ్రీ గంగమ్మ దేవాలయం పునఃప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం కార్యక్రమాలకు కర్ణాటకలోని శృంగేరి శ్రీ శారదా పీఠం పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శ్రీ శ్రీ విధుశేఖర భారతి మహాస్వామి జూన్ 30, జూలై 1 తేదీలలో విచ్చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పునఃప్రారంభం, ధ్వజస్థంభ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, వివిధ హోమాలు, మహా కుంభాభిషేకం వంటి వైభవోపేతమైన ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని ఆలయ నిర్వాహకులు ఆసం రఘురామిరెడ్డి (మాజీ మున్సిపల్ చైర్మన్)తో పాటు కమిటీ సభ్యులు తెలియజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

## నూతన తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు ఎక్సైజ్ అధికారుల మర్యాదపూర్వక భేటీ




**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 16:-**నూతనంగా సిద్ధవటం మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కుమార్‌ను మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ రాజశేఖర్, ఎస్సై నారాయణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు పుష్పగుచ్ఛం అందజేసి నూతన బాధ్యతల్లో విజయవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఎక్సైజ్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది.

## కనుమలోపల్లిలో వీధి దీపాల సమస్య..మహిళల ఆవేదన

**- పారిశుద్ధ్య పనులు చేపట్టాలని వినతి**





**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 16:-**సిద్ధవటం మండలం కనుమలోపల్లి గ్రామంలో వీధి విద్యుత్ దీపాలు రెండు నెలలుగా వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. రాత్రివేళల్లో అటవీ ప్రాంతం నుంచి విషపురుగులు సంచరిస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నామని తెలిపారు. అలాగే పారిశుద్ధ్య లోపం కారణంగా దోమల సమస్య తీవ్రంగా ఉందని, వీధి దీపాలు, పారిశుద్ధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సుధీర్ మాటాడుతూ, సమస్యను ప్రత్యేక అధికారి, తహసీల్దార్ విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లామని, రెండు రోజుల్లో వీధి దీపాల మరమ్మతులు పూర్తి చేసి పారిశుద్ధ్య చర్యలు చేపడతామని తెలిపారు.

## అత్యాధునిక డ్రోన్ కెమెరాల నిఘాతో కొనసాగుతున్న దాడుల స్పెషల్ డ్రైవ్

- జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జల్లెడ పడుతున్న పోలీసులు
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



**కడప టౌన్ మన జనప్రగతి జూన్ 16:-** గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలకు పోలీస్ అధికారులు స్పెషల్ పార్టీ సిబ్బంది ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ మరియు డ్రోన్ కెమెరాల ద్వారా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప ఇంచార్జ్ డి.ఎస్.పి బాలస్వామి రెడ్డి పర్యవేక్షణలో కడప వన్ టౌన్ సి.ఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో కడప నగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం, జూదం, తదితర అసాంఘిక కార్యకలాపాలు జరిగే అనుమానిత ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, కడప సబ్ డివిజన్ స్పెషల్ పార్టీ సిబ్బంది దాడులు నిర్వహిస్తున్నారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాల తో పాటు పోలీస్ సిబ్బంది రంగంలోకి దిగి జల్లెడ పడుతూ దాడులు చేయిస్తూ నిందితులను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. అనుమానిత ప్రాంతాల నుండి పారిపోయిన నిందితులను డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి వారిని అదుపులో తీసుకొని కౌన్సిలింగ్ మరియు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం కడప వన్ టౌన్ పరిధిలో రైల్వే స్టేషన్ పరిసరాలు, ఆర్ట్స్ కాలేజ్, ఎఫ్.సి.ఐ గిడ్డంగులు, తదితర జనసంచారం లేని ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానితులను గుర్తించే చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో నిరంతరం కడప నగరంలోని అనుమానిత ప్రాంతాలను పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జల్లెడ పట్టడం జరుగుతుందని కడప ఇంచార్జ్ డి.ఎస్.పి బాలస్వామి రెడ్డి తెలిపారు. ప్రజలు గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలు సంబంధించిన సమాచారాన్ని ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు తెలియచేయాలని కడప ఇంచార్జ్ డి.ఎస్.పి బాలస్వామి రెడ్డి సూచించారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడుల్లో వన్ టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతులు లేని ఫ్లెక్సీలను తొలగించాలి

**తొలగింపునకు వారి నుండే రుసుము వసూలు చేయాలి: కలెక్టర్ హరేంధిర ప్రసాద్**



**కాకినాడ మన జనప్రగతి జూన్ 16:-**జిల్లా కేంద్రం కాకినాడతో పాటు అన్ని మున్సిపాలిటీల్లో రోడ్ల డివైడర్లు, కూడళ్ళలో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తూ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలన్నిటినీ వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. పట్టణాల్లోని రోడ్ల మధ్య స్తంభాలపైన, రద్దీగా ఉండే కూడళ్ళలో స్థానిక సంస్థల నుండి ఎటువంటి అనుమతి లేకుండా అస్తవ్యస్తంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు వాహన చోదకులకు,పాదచారులకు పరిసరాలు కనబడకుండా అవరోధంగా నిలిచి ప్రమాదాలకు కారణమౌతున్నాయని, నిత్యం బాధిత ప్రజల నుండి వీటిపై ఫిర్యాదులు అందుతున్నాయని కలెక్టర్ తెలిపారు. పట్టణాలను అందవికారంగా చేస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న ఫ్లెక్సీలన్నిటినీ వెంటనే తొలగించి అందుకు అయిన ఖర్చును,అనుమతి లేకుండా ఫ్లెక్సీలను ప్రదర్శించినందుకు జరిమానాలను వాటిని ఏర్పాటు చేసిన వారి నుండి వసూలు చేయాలని మున్సిపల్ కమీషనర్లను కలెక్టర్ ఆదేశించారు. అనుమతులు లేకుండా తరచూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తూ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరేందిర ప్రసాద్ హెచ్చరించారు.

## ఫీజుల దోపిడీపై డీఈఓ ఎందుకు మౌనంగా ఉన్నారు..?

**కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్‌యూ డిమాండ్**

**డీఈఓ కార్యాలయం ఎదుట పుస్తకాలు, యూనిఫాంలతో నిరసన**




**కడప మన జనప్రగతి జూన్ 16:-**జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం మోపుతూ దోపిడీకి పాల్పడుతున్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) మౌనంగా ఉండటం ఆశ్చర్యకరమని ఏబీఎస్‌యూ జిల్లా నాయకుడు జగన్ రాథోడ్ విమర్శించారు. మంగళవారం కడపలోని డీఈఓ కార్యాలయం ఎదుట ఏబీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పుస్తకాలు, యూనిఫాంలు చేతబట్టి విద్యార్థులు, నాయకులు ఆందోళన చేపట్టి విద్యాశాఖ అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జగన్ రాథోడ్ మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభమైన వెంటనే జిల్లాలోని పలు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. నారాయణ, శ్రీ చైతన్య, బాష్యం, కేశవరెడ్డి, భీరం శ్రీధర్ రెడ్డి, ఎడిఫై, జీవన్ జ్యోతి తదితర విద్యాసంస్థల్లో ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా చార్జీల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి లక్ష రూపాయలకు పైగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ, వాటిని పట్టించుకోకుండా విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. పాఠశాలల్లో హాస్టళ్లు నిర్వహించడంపై నిబంధనలు ఉన్నప్పటికీ అనేక చోట్ల వాటిని ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. అలాగే కమలాపురం పరిధిలోని శ్రీ నారాయణ స్కూల్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా హాస్టల్ నిర్వహిస్తున్నారని, విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెంచుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పుస్తకాలు, యూనిఫాంలను అధిక ధరలకు విక్రయిస్తున్న అంశంపైనా విచారణ జరపాలని కోరారు. విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్‌యూ కడప నగర నాయకులు జోషఫ్, ఆదిత్య, విష్ణువర్ధన్, సంపత్, చిన్న రాయుడు, లోకేష్ రెడ్డి, విజయ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## పతనమైన పచ్చిమిర్చి ధరలు.. కన్నీరు పెడుతున్న కర్షకులు

- క్వింటాలు ధర 900 రూపాయలు



**లింగాల మన జనప్రగతి జూన్ 16:-**మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల కాలంలో పచ్చిమిర్చి సాగును రైతన్నలు విస్తారంగా చేపట్టారు. ప్రస్తుతం పచ్చిమిర్చి ధరలు పాతాళానికి పడిపోవడంతో రైతన్నలు కన్నీరు పెడుతున్నారు. దీంతో పచ్చిమిర్చి రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారు. ఆకాశాన్నంటిన పెట్టుబడి ఖర్చులు, తెగుళ్ల దాడులను తట్టుకుని పండించిన పంటకు మార్కెట్‌లో కనీస మద్దతు ధర లభించకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. గత కొన్ని రోజులుగా పచ్చిమిర్చి ధరలు దారుణంగా పతనం కావడంతో కోత కూలీలు, రవాణా ఖర్చులు కూడా వెళ్లదీయలేని పరిస్థితి ఏర్పడింది. భారీగా పెరిగిన దిగుబడి. పడిపోయిన డిమాండ్ వల్లనే ఈధరల పతనం. దీనికి తోడు ఈఏడాది పచ్చిమిర్చి సాగు భారీగా పెరిగింది. అనుకూల వాతావరణం వల్ల దిగుబడులు కూడా ఆశాజనకంగా వచ్చాయి. మార్కెట్‌కు పంట పోటెత్తడం, పొరుగు జిల్లాల్లో కూడా దిగుమతులు పెరగడంతో ఇతర ప్రాంతాలకు ఎగుమతులు మందగించడంతో స్థానిక మార్కెట్లలో ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. గత యేడాది ఈ మాసంలో క్వింటాలు పచ్చిమిర్చి ధర ₹4,000 నుండి ₹5,000 వరకు పలికింది. ఈ యేడాది కూడా మంచి రేటు ఉంటుందనే నమ్మకంతో లింగాల మండలం లోని పలు గ్రామాల్లో రైతులు పచ్చిమిరప పంటను విస్తారంగా సాగు చేశారు. ప్రస్తుతం క్వింటాలు పచ్చిమిర్చి ధర 900రూపాయలకు పడిపోయింది. అంటే కిలో పచ్చిమిర్చి ధర కేవలం 9రూపాయలకే దళారులు కొనుగోలు చేస్తున్నారు. పచ్చిమిరప పంట ఎకరాకు పెట్టుబడి కింద సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కలిపి దాదాపు లక్ష నుండి 1,50,000 రూపాయలకు పైగా ఖర్చవుతోంది. ఇప్పుడు వున్న ధర చూస్తే కనీసం కోత కూలీల ఖర్చు కూడా వచ్చేలా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. శీతల గిడ్డంగి (కోల్డ్ స్టోరేజ్) సౌకర్యాల కొరత: పండించిన పచ్చిమిరప పంట రేట్లు పతనమైనప్పుడు కొన్ని రోజులు నిల్వ ఉంచుకునేందుకు కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలు లేకపోవడం ఈ ప్రాంత రైతులకు శాపంగా మారింది. నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో, దళారులు అడిగిన ధరకే తక్కువకు తెగనమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మిర్చి రైతులకు మద్దతు ధర కల్పించే విధంగా ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని మిర్చి రైతులకు మద్దతు ధర కల్పించాలని పలు రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే నేరుగా పచ్చిమిర్చిని కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని పలు రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

## 12 ఏళ్ల మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి: ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి




**కాకినాడ మన జనప్రగతి జూన్ 16:-**ప్రధాని నరేంద్ర మోడీ 12 ఏళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి జరిగిందని 'సర్' రాష్ట్ర కన్వీనర్ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. 12 ఏళ్ల మోడీ పాలనలో బీజేపీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం కాకినాడలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన దేశం సాధించిన అభివృద్ధిపై విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించగా రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మోడీ 12 ఏళ్లుగా ఓటింగ్ ద్వారా ఎంపికైన ప్రధానిగా పనిచేసి ఎన్నో రంగాలలో అభివృద్ధి సాధించారన్నారు. ప్రపంచంలో అతిపెద్ద నాలుగో ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు ఇంకా 10 కోట్ల మందికి గ్యాస్ కనెక్షన్లు, పీఎం ఆవాస్ ద్వారా నాలుగు కోట్ల గృహాలు అందించారని చెప్పారు. స్వచ్ఛభారత్ పథకం ద్వారా కరెంట్ కోట్ల మరుగుదొడ్లను నిర్మించి ఆత్మాభిమానం కాపాడిందన్నారు. 11వేల కిలోమీటర్లు మెట్రో రైల్వే లైన్ వేసి124 మంది వందే భారత్ రైళ్లను ప్రయాణికులకు అందించిందన్నారు. ఇంకా సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సింధూర్ వంటి కార్యక్రమాలు చేబట్టి ఉగ్రవాదాన్ని నిరోధించిందన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా ఏర్పాటు చేసి ప్రపంచంలో పేరు, ప్రఖ్యాతలను ప్రధాని మోదీ భారతదేశంకు గౌరవంను తీసుకొచ్చారన్నారు. కాకినాడ- రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డు జాతీయ రహదారిగా వెడల్పు చేస్తామని నల్లమిల్లి చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, బీజేపీ నాయకులు యెనిమిరెడ్డి మాలకొండయ్య, దువ్వూరి సుబ్రహ్మణ్యం, విశ్వనాథపల్లి శ్రీనివాసరాజు, కుండల సాయికుమార్, చక్కా రమేష్, తదితరులు పాల్గొన్నారు

## రాజంపేట టీడీపీ ఇన్‌చార్జిపై సీఎం చంద్రబాబుకు కిరణ్ స్వామి ఫిర్యాదు




**ఒంటిమిట్ట మన జనప్రగతి జూన్ 16:-**రాజంపేట తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్ రాజు వ్యవహారశైలిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒంటిమిట్ట మండలం మంటపంపల్లి పంచాయతీకి చెందిన టీడీపీ కార్యకర్త ఉన్నం కిరణ్ కుమార్ (కిరణ్ స్వామి) ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. రాజంపేట నియోజకవర్గంలో పార్టీ కోసం గత ఐదేళ్లుగా కష్టపడ్డ కార్యకర్తలకు ప్రాధాన్యత లేకుండా, ఇటీవల ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పెద్దపీట వేస్తున్నారని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యక్తిగత ప్రయోజనాల కోసం పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారని, వారికి ఇన్‌చార్జి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రికి వివరించేందుకు ఈ నెల 14న మంటపంపల్లిలోని తన నివాసంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే సమావేశం ప్రారంభం కాకముందే తమ ఆహ్వానం లేకుండా కొందరు వ్యక్తులు సమావేశంలోకి ప్రవేశించి అంతరాయం కలిగించారని, దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి వచ్చిందని లేఖలో వివరించారు. పార్టీ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసే విధంగా జరుగుతున్న పరిణామాలపై పార్టీ అధిష్ఠానం ప్రత్యేక కమిటీని నియమించి విచారణ చేపట్టాలని కిరణ్ స్వామి కోరారు. అలాగే చమర్తి జగన్మోహన్ రాజు వ్యవహారశైలిపై సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక

17 - 06 - 2026

# ఓటరు జాబితా ప్రక్షాళనకు 'సర్' కార్యక్రమం..

**• ప్రతి ఓటరు సహకరించాలని నాయకుల పిలుపు**



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 16:**-మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలోని బూత్‌ల పరిధిలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా పునర్విమర్శ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలతో కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలేఖ భర్త, జనసేన నాయకుడు దేరంగుల శ్రీకాంత్, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్ పాల్గొని ఓటర్లకు గణన ఫారాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన 'సర్' కార్యక్రమం లక్ష్యం ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమేనని తెలిపారు. చనిపోయిన వ్యక్తుల పేర్లు, ఒకే వ్యక్తికి రెండుచోట్ల నమోదైన ఓట్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారి పేర్లు, అనర్హులైన ఓటర్ల వివరాలను తొలగించడం ద్వారా నిజమైన అర్హులైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయడం జరుగుతుందని వివరించారు. ప్రతి ఓటరు తన వివరాలను సరిచూసుకుని ఎన్నికల సంఘం అందజేసిన గణన ఫారాన్ని పూర్తి చేసి బీఎల్‌ఓలకు అందజేయాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు సరిగా ఉండటం ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమని, ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని కోరారు.సరైన వివరాలు నమోదు చేయడం ద్వారా భవిష్యత్ ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చేపూరి లక్ష్మీనరసయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ హరీష్, గ్రామస్థులు మస్తానయ్య, నరేంద్ర, సాయి, శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# కడపలో సందడి చేసిన 'నాగబంధం' చిత్ర బృందం

**• జులై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న సినిమా**

**• రాజీవ్ పార్క్‌లో అభిమానులతో ముచ్చటించిన హీరో,హీరోయిన్**



**కడప మన జనప్రగతి జూన్ 16:**-పాన్ ఇండియా చిత్రంగా తెలుగు, కన్నడ, హిందీ, తమిళం,మలయాళ భాషల్లో నిర్మితమైన 'నాగబంధం' సినిమా జులై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా సినిమా హీరో విరాట్ కర్ణ, హీరోయిన్ నభా నటేష్, దర్శకుడు అభిషేక్ నామాతో పాటు సాంకేతిక బృందం సభ్యులు సోమవారం కడప నగరంలో సందడి చేశారు.నగరంలోని రాజీవ్ పార్క్ వద్ద అభిమానులు, ప్రజలతో ముచ్చటించిన చిత్ర బృందం వారికి సినిమా విశేషాలను వివరించింది. ఈ సందర్భంగా హీరో, హీరోయిన్‌లు చిత్రంలోని పాటకు నృత్యం చేసి అభిమానులను అలరించారు.అనంత పద్మనాభస్వామి భారీ విగ్రహంతో ప్రత్యేక రథయాత్రను నిర్వహించిన చిత్ర యూనిట్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. స్వామివారి విగ్రహాన్ని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు, అభిమానులు తరలివచ్చారు.ఈ సందర్భంగా హీరో విరాట్ కర్ణ, హీరోయిన్ నభా నటేష్ మాట్లాడుతూ ప్రేక్షకుల ఆదరణ తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ జులై 3న విడుదల కానున్న 'నాగబంధం' చిత్రాన్ని థియేటర్లలో వీక్షించి ఆశీర్వదించాలని కోరారు. అనంత పద్మనాభస్వామి విగ్రహాన్ని కడపకు తీసుకురావడం సినిమా ప్రమోషన్‌లో భాగమేనని తెలిపారు.ఈ చిత్రం నేటి యువతకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల విలువలను తెలియజేసే విధంగా రూపొందించామని, సనాతన ధర్మ విశిష్టతను ప్రతిబింబించే అంశాలు ఇందులో ఉంటాయని పేర్కొన్నారు. 'నాగబంధం' ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని అందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో వైఎస్సార్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియం చైర్మన్ ఆర్. శ్రవణ్ రాజ్ రెడ్డి, కందుల గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబులరెడ్డి (నాని), ఈవెంట్ మేనేజర్ హేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దాతృత్వానికి కొత్త నిర్వచనం

**- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లక్ష రూపాయల ప్రోత్సాహకం..!**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 16:**-విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించడంలో భాగంగా ప్రముఖ ప్రజాప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.రామేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తన మేనమామ పాతకోట రామముని రెడ్డి అలాగే అయన భార్య పార్వతమ్మ స్మారకార్థం గత కొన్ని సంవత్సరాలుగా పదో తరగతి ఉత్తీర్ణ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తూ వస్తున్నారు. ఈ పథకం కింద మొదటి బహుమతిగా రూ.9 వేలు,రెండో బహుమతిగా రూ.6వేలు,మూడో బహుమతిగా రూ.3 వేలు చొప్పున విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందజేయబడుతోంది.ఈ ఏడాది బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన కీలక ప్రకటన చేశారు. తన మేనమామ ప్రారంభించిన సేవా కార్యక్రమాన్ని ఇకపై తమ కుటుంబం కొనసాగిస్తుందని వెల్లడించిన ఆయన, వచ్చే సంవత్సరాల నుంచి బహుమతుల మొత్తాన్ని గణనీయంగా పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇకపై మొదటి బహుమతిగా రూ.1 లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేల, మూడో బహుమతిగా రూ.25 వేల చొప్పున అందజేస్తామని తెలిపారు. తమ కుటుంబం ఉన్నంతకాలం ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు.ఈ ప్రకటనతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యను ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో నారాయణ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పాతకోట వంశీధర్ రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# 4 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వనమాడి శంకుస్థాపన



**కాకినాడ మన జనప్రగతి జూన్ 16:**-కాకినాడ నగర అభివృద్ధిలో కీలకమైన సంజయ్ నగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతంలోని 700 మీటర్ల రోడ్డు నిర్మాణ పనులకు సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) మంగళవారం శంకుస్థాపన చేశారు. సుమారు 4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ రహదారి నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి ఆయన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ, సర్పవరం జంక్షన్ నుండి పాత పోర్టు పోలీస్ స్టేషన్ వరకు స్మార్ట్ సిటీ నిధులతో రహదారి నిర్మాణం గతంలో చేపట్టినప్పటికీ, మధ్యలో ఉన్న సంజయ్ నగర్ డంపింగ్ యార్డు కారణంగా సుమారు 700 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం నిలిచిపోయిందన్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంజయ్ నగర్ డంపింగ్ యార్డులో పేరుకుపోయిన ఘన వ్యర్థాలను త్వరలోనే జిందాల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు తరలించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు.డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.ఈ 700 మీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తయితే సర్పవరం జంక్షన్ నుంచి పాత పోర్టు పోలీస్ స్టేషన్ వరకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, పరిసర ప్రాంతాల అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్వివి సత్యనారాయణ, సూపరింటెండింగ్ ఇంజనీర్ పి వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దళే పృథ్వీ చరణ్, నాయకులు తుమ్మల సునీత, అల్లం రాజు, ఎరిపిల్లి రాము, మూగు రాజు, చోడిపిల్లి సతీష్, లూటికుర్తి మోహన్, మోసా పేతురు, గాది శివ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుగా.. వైకాపా నేతగా విశిష్ట సేవలు అందించిన మహేశ్వర్‌రెడ్డి కన్నుమూత

**కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించిన నాగేళ్ల సాంబశివరెడ్డి**

**చాగలేరులో భౌతికకాయానికి నివాళులర్పించిన నాయకులు, జర్నలిస్టులు, గ్రామస్తులు**



**వేముల మన జనప్రగతి జూన్ 16:**- వేముల మండల పరిధిలోని చాగలేరు గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రంరెడ్డి మహేశ్వర్‌రెడ్డి అనారోగ్యంతో సోమవారం రాత్రి కన్నుమూశారు.గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మృతి వార్త తెలిసి కుటుంబ సభ్యులు,పాత్రికేయులు, రాజకీయ నాయకులు,గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.మహేశ్వర్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి,ఎంపీపీ భర్త చల్లా వెంకటనారాయణ మంగళవారం ఉదయం ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...మహేశ్వర్‌రెడ్డి జర్నలిజం రంగంలోనూ,వైఎస్సార్‌సీపీ పార్టీ బలోపేతంలోనూ విశేష కృషి చేశారని కొనియాడారు.ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను ఎప్పటికీ మరువలేమని అన్నారు.మహేశ్వర్‌రెడ్డి కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలా అండగా ఉంటామని నాగేళ్ల సాంబశివరెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు,నాయకులు,కార్యకర్తలు,కుటుంబ సభ్యులు,గ్రామ పెద్దలు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహేశ్వర్‌రెడ్డికి నివాళులర్పించారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పారిశుధ్య కార్మికులకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 16:** పులివెందుల పురపాలక సంఘ పరిధిలోని శానిటరీ కార్మికుల సామర్థ్య వృద్ధి,నైపుణ్య అభివృద్ధి కోసం స్థానిక మునిసిపల్ కౌన్సిల్ హాల్ నందు మంగళవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నాలెడ్జ్ పార్టనర్ అయిన 'ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్' ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ శిక్షణలో శానిటరీ కార్మికులకు పారిశుధ్య నిర్వహణపై పలు కీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పాటించాల్సిన ఆధునిక పద్ధతులను,వ్యర్థాల వేరు చేయడం తడి,పొడి వ్యర్థాలను మూలంలోనే ఎలా వేరు చేయాలనే అంశం పై విధి నిర్వహణలో వ్యక్తిగత రక్షణ పరికరాల (పీపీఈ కిట్స్ ) ప్రాముఖ్యత మరియు వాటిని తప్పనిసరిగా వినియోగించే విధానాన్ని కార్మికులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్ జి.చెన్నయ్య మునిసిపల్ కమీషనర్ సి.మునికుమార్ మరియు శానిటరీ ఇన్స్పెక్టరు ఆర్.నటరాజ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమైనదని వారు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా,సురక్షితంగా నిర్వహించేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని శుభ్రమైన, ఆరోగ్యకరమైన పట్టణ వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలన్నారు.శిక్షణలో పాల్గొన్న శానిటరీ కార్మికులు ఈ కార్యక్రమంపై సంతోషం వ్యక్తం చేశారు.ఆధునిక పద్ధతులు,సురక్షిత ప్రమాణాల గురించి తాము కొత్త విషయాలు తెలుసుకున్నామని,వీటిని క్షేత్రస్థాయిలో అమలు చేసి పట్టణ శుభ్రతలో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.పులివెందుల మునిసిపాలిటీ పారిశుధ్య ప్రమాణాలను మరో స్థాయికి తీసుకెళ్లడంలో ఈ శిక్షణ ఒక ముఖ్యమైన ముందడుగు అని అధికారులు మరియు సిబ్బంది పేర్కొన్నారు.

# సిద్ధవటంలో 20 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 16:**-మండల కేంద్రమైన సిద్ధవటం గ్రామ సచివాలయ పరిధిలోని జంగాలపల్లె, కమ్మపాలెం, వెలుగుపల్లి తదితర గ్రామాలకు చెందిన పట్టాదారు రైతుల కోసం 20 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులోకి వచ్చినట్లు వ్యవసాయ అధికారి (ఏవో) రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం సిద్ధవటం గ్రామ పరిధి రైతులకు యూరియా పంపిణీ చేపడుతున్నామని, మండలంలోని మిగిలిన గ్రామ సచివాలయాల పరిధిలో కూడా యూరియా నిల్వలు చేరిన వెంటనే రైతులకు అందజేస్తామని చెప్పారు. రైతులు అవసరానికి అనుగుణంగా యూరియాను వినియోగించి పంటల దిగుబడిని మెరుగుపరచుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువుల సరఫరా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 16:**-ప్రొద్దుటూరు పట్టణంలోని టీబీ రోడ్డులో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైఎంఆర్ కాలనీ ప్రధాన వీధుల్లో పల్స్ పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డా.కె.మానస మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి బంగారు భవిష్యత్తును కాపాడాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. పోలియో నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమంలో తల్లులకు అవగాహన కల్పించి, 100 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా ప్రొద్దుటూరును పోలియో రహిత పట్టణంగా కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్వైజర్ బి. రాజారత్నం, సీఓఎంవీ సుబ్బారెడ్డి, వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, టీబీ సిబ్బంది ప్రసాద్, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

# నగర వనం రివర్ ఫ్రంట్‌లో యోగా కార్యక్రమం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 16:** ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'యోగాంధ్ర - 2026' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం స్థానిక నగర వనంలోని గరండాల రివర్ ఫ్రంట్ నందు యోగా కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.యోగా గురువు వెంకట్రామ్ రెడ్డి ప్రముఖ యోగా గురువు వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్న వారితో వివిధ రకాల యోగాసనాలు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూప్రస్తుత ఒత్తిడితో కూడిన జీవన విధానంలో మనిషి మానసిక ప్రశాంతతకు,శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతో దోహదపడుతుంది.ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలన్నారు.యోగా ద్వారా రోగనిరోధక శక్తి పెరిగి,సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆయన తెలియజేశారు.ఈ యోగాంధ్రలో పులివెందుల పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీరామ్ తో పాటు స్థానిక అధికారులు, మున్సిపల్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు, యోగా ప్రేమికులు పాల్గొన్నారు.ప్రకృతి ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం అందరిలోనూ సరికొత్త ఉత్సాహాన్ని నింపింది.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

17 - 06 - 2026

## రైతు సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శం: మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి, మన జనప్రగతి జూన్ 16 :-** రాష్ట్రంలో రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులపై తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని ఆయన అన్నారు.రైతు ఆత్మహత్యలపై వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని, గత రెండేళ్లలో 148 కేసులు మాత్రమే అధికారికంగా రైతు ఆత్మహత్యలుగా నిర్ధారణ అయ్యాయని చెప్పారు. అర్హులైన కుటుంబాలకు రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నామని వెల్లడించారు.అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. 2025-26లో 46.86 లక్షల రైతు కుటుంబాలకు రూ.8,985 కోట్లకు పైగా విడుదల చేసినట్లు పేర్కొన్నారు.గత ప్రభుత్వ కాలంలో పెండింగ్‌లో ఉన్న ధాన్యం బకాయిల రూ.1,674 కోట్లను చెల్లించామని చెప్పారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా మామిడి, ఉల్లి, పొగాకు, కోకో రైతులకు కలిపి రూ.588 కోట్ల సహాయం అందించినట్లు తెలిపారు.రాష్ట్రంలోని 22.5 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు రోజుకు 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ఇందుకు రూ.13,241 కోట్ల సబ్సిడీ వ్యయం అవుతోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 68,988 కొత్త విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఉద్యాన పంటల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. సూక్ష్మసేద్యం అమలులో కూడా రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని చెప్పారు.ఖరీఫ్‌కు అవసరమైన ఎరు వుల కొరత లేదని, జూన్ 8 నుంచి 16 వరకు రాష్ట్రవ్యాప్తంగా 4.77 లక్షల ఎరువుల బస్తాలు రైతులకు విక్రయించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. రైతులు అసత్య ప్రచారా లను నమ్మకుండా వాస్తవాలను గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీన సామగ్రి భద్రతపై ప్రత్యేక దృష్టి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప,మన జనప్రగతి జూన్ 16:-** ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వస్తు సామగ్రి భద్రత కోసం జిల్లాలో చేపట్టిన భవన నిర్మాణ పనులు త్వరితగతిన. పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మంగళవారం రాష్ట్ర రాజధాని నుండి రాష్ట్రక్కఆ హైకోర్టు జ్యూడిషియల్ రిజిస్ట్రార్ ఎస్. కమలాకర రెడ్డి సంబంధిత న్యాయమూర్తులతో కలిసి.. ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) చట్టం కింద స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలు, నిషేధిత వస్తువుల భద్రత కోసం జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న శాశ్వత నిల్వ కేంద్రాల నిర్మాణ పురోగతిపై.. అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరై.. జిల్లాలో ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న వస్తువుల తాత్కాలిక, శాశ్వత భద్రతా ఏర్పాట్లు, అందుబాటులో ఉన్న భద్రతా సదుపాయాలు, నిర్మాణ పనుల పురోగతిపై రాష్ట్ర హైకోర్టు జ్యూడిషియల్ రిజిస్ట్రార్ కు వివరించారు. జిల్లా ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సామగ్రిని భద్రపరిచేందుకు ఒక భవనాన్ని ఏర్పాటు చేసేందుకు తాజాగా భూమి పూజచేసి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు.ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. అందులో మౌలిక సదుపాయాలు, సామగ్రి నిల్వ, భద్రతా చర్యలపై జిల్లా పోలీసు యంత్రాంగంతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు.అంతకు ముందు వీసీలో హైకోర్టు రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల మేరకు ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న నిషేధిత పదార్థాల భద్రత కోసం ప్రతి జిల్లాలో శాశ్వత నిల్వ కేంద్రాల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత భవనాల నిర్మాణ పనుల పురోగతి, తాత్కాలిక నిల్వ సదుపాయాలు, భద్రతా చర్యలపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని జిల్లాల్లో శాశ్వత నిల్వ కేంద్రాల నిర్మాణాన్ని వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సమావేశంలో సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, కలెక్టరేట్ ఏవో గంగయ్య, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ



**హైదరాబాద్ మన జనప్రగతి జూన్ 16:-** నేషనల్ అకాడమీ అఫ్ సైబర్ సెక్యూరిటీ దేశ, విదేశాలలో అత్యంత ప్రాధాన్యత కలిగినటువంటి సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్ లైన్ ట్రైనింగ్ కొరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్ లైన్ లో దరఖాస్తులు కోరబడుచున్నవి. ఇంటర్ పాస్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా అండ్ ఇంజనీరింగ్ చదువుతున్న, పూర్తి చేసిన విద్యార్థులు ఈ సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్ లైన్ ద్వారా ట్రైనింగ్ పొందేందుకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అని నేషనల్ అకాడమీ అఫ్ సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ విమలా రెడ్డి తెలిపారు. కోర్సులు: సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్, పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్. మాస్టర్ ప్రోగ్రాం ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్. శిక్షణ కాలం 5 నుండి 10 నెలల వరకు, శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో సర్టిఫికెట్స్ ప్రధానం చేయబడును. సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ, విదేశాలలో విస్తృత ఉపాధి అవకాశాలు గలవు. సైబర్ సెక్యూరిటీ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు సాఫ్ట్వేర్, ఐ.టి, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్ కేర్, రిటైల్ , ఈ కామర్స్, ఎడ్యుకేషన్ రంగం లో సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ అనలిస్ట్, పెనిట్రేషన్ టెస్టర్, సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ ఇంజనీర్, సెక్యూరిటీ సిస్టమ్స్ అడ్మినిస్ట్రేటర్, ట్రైనర్ మొదలగు ఉద్యోగావకాశాలు గలవు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్ : www.nationalcybersecurityacademy.org ఫోన్ నెంబర్: 7893141797

## ప్రొద్దుటూరులో ఓటర్ల జాబితా సవరణపై అక్రమాలు జరుగుతున్నాయని వైసీపీ ఆరోపణ



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 16:-**ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఓటర్లు పాలకులను ఎన్నుకోవాల్సి ఉండగా, ప్రస్తుత పరిస్థితుల్లో పాలకులే ఓటర్లను నిర్ణయించే పరిస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు.తెలుగుదేశం పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు ఐ టిడిపి యాప్ ద్వారా వైసీపీకి మద్దతు ఇచ్చే ఓటర్లను గుర్తించి, ఫారం-7 ద్వారా వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.చనిపోయిన వారిగా లేదా స్థానికంగా నివసించడం లేదని చూపిస్తూ ఓట్ల తొలగింపుకు కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. ఓటర్ల ధృవీకరణ ప్రక్రియలో అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాల్సి ఉండగా, ప్రొద్దుటూరులోని కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలు, సత్రాల్లో కూర్చొని సర్వే పూర్తి చేస్తున్నారని ఆయన విమర్శించారు. అలాగే సర్వేకు ముందు అన్ని రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లకు సమాచారం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, కొందరు అధికారులు కేవలం టీడీపీ ఏజెంట్లకే సమాచారం ఇస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల్లో ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తమైన నేపథ్యంలో, ఇప్పుడు ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఓటు హక్కును హరించడం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడమేనని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఓటర్ల నమోదు ప్రక్రియకు ఇంకా 29 రోజుల సమయం ఉందని పేర్కొంటూ, పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఓటరు తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ఐఆర్ ) -2026లో ఓటర్ల జాబితా సవరణను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్




**తిరుపతి మన జనప్రగతి జూన్ 16:-**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారుమంగళవారం స్థానిక కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులతో కలిసి మునిసిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎన్నికల విభాగ అధికారులతో వర్చువల్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయడం సంబంధిత అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలోని కొన్ని బూత్‌లలో మ్యాపింగ్ పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, వెనుకబడిన అధికారులు వెంటనే పనితీరు మెరుగుపరచుకోవాలని ఆదేశించారు.మ్యాపింగ్, ఇంటింటి సర్వే, డేటా నవీకరణ తదితర కార్యక్రమాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని పేర్కొన్నారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని తప్పనిసరిగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన మరియు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే సమీక్షా సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, కచ్చితత్వం, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో తిరుపతి, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారులు రామ్మోహన్, దేవేంద్రరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్‌మాండ్, ఎన్నికల విభాగ అధికారులు, సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

● రెండు కత్తులు, మూడు సెల్ ఫోన్లు, రెండు రాడ్లు ఒక కారు స్వాధీనం

● మీడియాకు వివరాలు తెలిపిన రిమ్స్ పి.ఎస్ సి.ఐ రాజగోపాల్



**కడప రూరల్ మన జనప్రగతి జూన్ 16:-** ఈనెల 10వ తేదీ కడప జిల్లా రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగినటువంటి రామసుబ్బారెడ్డి మరియు మధురవాణిల యొక్క కార్ డ్రైవర్ వంశీ అన్నతడిని, వంశీ యొక్క ఓనరు రామసుబ్బారెడ్డి మరియు బుద్దయ్యపల్లి కు చెందిన దేవకుమార్ మోడీమేదిపల్లికి చెందిన నాగార్జున శ్రీనివాసులు ఒక పథకం ప్రకారం హత్యకు ప్లాన్ వేసి అతన్ని సింగపూర్ టౌన్షిప్ లోని ఒక ఇంటిలోనికి తీసుకెళ్ళి కత్తులతో పొడిచి చంపి శవాన్ని ఒంటిమిట్ట మండలం సాలాబాదు రోడ్డులోని సోమశిల జలాలకు దగ్గరలో గుర్తుతెలియని ప్రదేశంలో కొండ దగ్గర పడి వేయడం జరిగింది , పై కేసులో మంగళవారం పై కేసులో ముద్దాయిలు దేవకుమార్, నాగార్జున, శ్రీనివాసులను అరెస్టు చేసి వారి వద్ద నుండి, రెండు కత్తులు, మూడు సెల్ ఫోన్లు, రెండు రాడ్లు ఒక కారు స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్ కు పంపించడం జరిగినది. అని అన్నారు

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగస్వాములు కండి

- ప్రతి అర్హ ఓటరు వివరాలను ధృవీకరించుకోవాలి: గ్రామ కమిటీ ప్రతినిధులు



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 16:-**భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్2026) కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని 6వ గ్రామ కమిటీ అధ్యక్షుడు పద్మారెడ్డి రాజకుమార్, బీఎల్ఓ అశోక్‌కుమార్ కోరారు.మంగళవారం వేంపల్లె పట్టణంలోని గరుగు వీధి పరిధిలో గల పోలింగ్ బూత్‌లు 233, 234 వద్ద ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఇంటింటి ధృవీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఓటర్ల జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పద్మా ఓబులేసు, తల్లం కిరణ్, బాబా ఫక్రుద్దీన్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుడు ఎర్రంరెడ్డి మహేశ్వర్ రెడ్డికి ఘన నివాళి

- పాత్రికేయ రంగానికి తీరని లోటు




**వేముల మన జనప్రగతి జూన్ 16 :-** వేముల మండలం చాగలేరు గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు ఎర్రంరెడ్డి మహేశ్వర్ రెడ్డి అనారోగ్య కారణాలతో సోమవారం రాత్రి కన్నుమూయడం పాత్రికేయ లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే సహచర పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.వేముల మండల పాత్రికేయుడిగా, అలాగే పులివెందుల పీసీ ఇన్‌చార్జిగా మహేశ్వర్ రెడ్డి ఎన్నో సంవత్సరాల పాటు విశేష సేవలు అందించారు. వార్తల సేకరణలో నిష్పక్షపాత ధోరణి, ప్రజా సమస్యలపై స్పందించే తత్వం, వృత్తిపట్ల అంకితభావం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయి. గ్రామీణ ప్రాంతాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి అనేక వార్త కథనాలు అందించడంలో జిల్లాలో మహేష్ రెడ్డి కీలక పాత్ర వహించాడు అని చెప్పుకోవచ్చు గతంలో వార్తాపత్రికలో పనిచేస్తున్న సమయంలో వ్యవసాయ రంగంలో రాసిన వార్తలకు సంబంధించి యాజమాన్యం మహేష్ రెడ్డిని ఎంతో అభినందించడం జరిగింది పాత్రికేయ వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించిన మహేశ్వర్ రెడ్డి, తన కలం ద్వారా అనేక ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చారు. సహచర పాత్రికేయులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ యువ జర్నలిస్టులకు మార్గదర్శకుడిగా నిలిచారు. ఆయన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని పలువురు పేర్కొన్నారు.మహేశ్వర్ రెడ్డి మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటని, ఆయన లేని లోటును భర్తీ చేయడం కష్టమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. అలాగే మహేశ్వర్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు.

## రెవెన్యూ అంశాలపై సీఎస్ సమీక్ష




**తిరుపతి మన జనప్రగతి జూన్ 16:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ మంగళవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) మరియు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి పాల్గొన్నారు.22ఏ, వెబ్‌ల్యాండ్, రీ-సర్వే, పీజీఆర్ఎస్, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, సీజనల్ పరిస్థితులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, వాతావరణ మార్పుల ప్రభావం నుంచి పంటల సంరక్షణ, నీట్ పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు.జిల్లా నుంచి కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, ఆర్డీవోలు, ఇతర రెవెన్యూ అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
17 - 06 - 2026

# రూ.33 లక్షల నష్టపరిహారం కాజేశారు

**● తండ్రి ఆస్తిలో అక్రమ పంపకాలు..కుటుంబ సభ్యుల ఆరోపణలు ● రెవెన్యూ అధికారుల పాత్రపై అనుమానాలు..న్యాయం చేయాలని బాధితుల విజ్ఞప్తి**

**రైల్వేకోడూరు మన జన ప్రగతి జూన్ 16:**-తండ్రి ఆస్తిని కుటుంబ సభ్యులకు తెలియకుండా అక్రమంగా తన పేరిట మార్చించుకుని, జాతీయ రహదారి భూసేకరణకు సంబంధించిన దాదాపు రూ.33 లక్షల నష్టపరిహారాన్ని స్వాహా చేశారంటూ తిరుపతి జిల్లా రైల్వేకోడూరు మండలం శెట్టుగుంట గ్రామానికి చెందిన షేక్ బాబాసాహెబ్ కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారుల సహకారంతో రికార్డులు తారుమారు చేశారని బాధితులు ఆరోపిస్తూ న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు.బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, శెట్టుగుంట గ్రామానికి చెందిన స్వర్గీయ షేక్ బాబాసాహెబ్‌కు 1967లో డీకే పట్టాతో పాటు ఇతర భూములు కలిపి మొత్తం 13 ఎకరాల 89 సెంట్ల భూమి ఉండేదని తెలిపారు. బాబాసాహెబ్‌కు మొత్తం పది మంది సంతానం ఉండగా, తండ్రి మరణానంతరం నాలుగో కుమారుడైన షేక్ షుకూర్ అలియాస్ దిన్నేపాటి షుకూర్ మిగిలిన తొమ్మిది మంది వారసులకు



తెలియకుండా భూమి రికార్డులను తనకు అనుకూలంగా మార్చించుకున్నారని ఆరోపించారు.సర్వే నంబర్ 2189/1లోని 77 సెంట్ల భూమితో పాటు మరో రెండు ఎకరాలకు పైగా భూమిని తన పేరిట ఆన్‌లైన్ చేయించుకున్నారని, అందులో 57 సెంట్లు జాతీయ రహదారి విస్తరణలో భూసేకరణకు వెళ్లగా అందుకు వచ్చిన దాదాపు రూ.33 లక్షల నష్టపరిహారాన్ని తన ఖాతాలోకి జమ చేయించుకున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.మిగిలిన 20 సెంట్ల భూమిని తన భార్య పేరిట మార్చేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ వ్యవహారంలో కొందరు రెవెన్యూ అధికారులు సహకరించారని బాధితులు పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న వ్యూహాన్ రికార్డులను తారుమారు చేశారని ఆరోపించారు. సంబంధిత భూమికి సంబంధించిన ఆన్‌లైన్ రికార్డులు, అవార్డు కాపీల కోసం సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద దరఖాస్తు చేసినప్పటికీ అవసరమైన పత్రాలు అందుబాటులో లేవని సమాధానం రావడంతో మరిన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయని బాధితులు తెలిపారు.భూమి విషయంలో కుటుంబ సభ్యుల మధ్య అధికారికంగా భాగపరిష్కారం జరగకపోయినప్పటికీ మొత్తం నష్టపరిహారం ఒకే వ్యక్తికి ఎలా చెల్లించారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై బాధితులు ఇప్పటికే కోర్టును ఆశ్రయించడమే కాకుండా తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.ఈ వ్యవహారంలో నిజానిజాలను వెలికితీసి, నష్టపరిహారాన్ని అర్హులైన వారసులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు ఈ ఆరోపణలపై ఎలా స్పందిస్తారు, బాధితులకు ఎలాంటి న్యాయం జరుగుతుందనే అంశం ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## ఉరవకొండలో సీపీఐ రాజకీయ - సైద్ధాంతిక శిక్షణ శిబిరాలు



**ఉరవకొండ మన జనప్రగతి జూన్ 16:**-భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 25 వరకు ఉరవకొండ పట్టణంలోని దేవాంగ కళ్యాణమండపంలో జిల్లాస్థాయి రాజకీయసైద్ధాంతిక శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి తెలిపారు. మంగళవారం శిబిరం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా సుమారు 250 మంది ప్రతినిధులు ఈ శిబిరాలకు హాజరవుతారని చెప్పారు.మూడు రోజుల పాటు జరిగే ఈ శిబిరాల్లో జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు, దేశ ఆర్థిక విధానాలు, కార్మికరైతాంగ సమస్యలు, సామాజిక మార్పులు, ప్రజాస్వామ్య పరిరక్షణ, పార్టీ నిర్మాణం తదితర అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణుల్లో రాజకీయ చైతన్యం పెంపొందించడంతో పాటు సిద్ధాంతపరమైన అవగాహన కల్పించడమే శిబిరాల లక్ష్యమని పేర్కొన్నారు.ఈనెల 23న జరిగే ప్రారంభ కార్యక్రమానికి పార్టీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతారని, అనంతర రోజుల్లో రాష్ట్ర నాయకులు జీవీ సత్యనారాయణమూర్తి,డి.జగదీష్,రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య వివిధ అంశాలపై శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లికార్జున, కేశవరెడ్డి, చెన్నరాయుడు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పరకాల ప్రభాకర్ ఆరోపణలపై స్పందించాలన్న కేవీ రమణ



**అనంతపురం మన జనప్రగతి జూన్ 16:**-ప్రముఖ ఆర్థిక, రాజకీయ విశ్లేషకుడు డాక్టర్ పరకాల ప్రభాకర్ దేశవ్యాప్తంగా వివిధ అంశాలపై చేస్తున్న ఆరోపణలు, వ్యాఖ్యలపై అధికార కూటమి పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని కేవీ రమణ డిమాండ్ చేశారు. ఈవీఎంల ట్యాంపరింగ్, ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల సంఘం పనితీరుపై పరకాల ప్రభాకర్ లేవనెత్తిన అంశాలు ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయని అన్నారు.ఈ ఆరోపణల్లో వాస్తవాలు లేకపోతే అధికార పార్టీలు వాటిని ఖండించి తగిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిజమైతే ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించే దిశగా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరారు. దేశంలో ఆర్థిక, సామాజిక అసమానతలు పెరుగుతున్నాయని, రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువత అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రజలు ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల వ్యవస్థపై వస్తున్న సందేహాలకు అధికార యంత్రాంగం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ప్రతిపక్షాలు కూడా ప్రజా సమస్యలపై మరింత చురుకుగా స్పందించి దేశవ్యాప్త చర్చకు దోహదపడాలని కేవీ రమణ పిలుపునిచ్చారు.

## పరిశుభ్రతతో డయేరియాకు చెక్..!

**- 'స్టాప్ డయేరియా అతిసారం ఆపండి' ప్రచార కార్యక్రమం ప్రారంభం**




**వజ్రకరూర్ మన జనప్రగతి జూన్ 16:**-వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డయేరియా వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'స్టాప్ డయేరియా అతిసారం ఆపండి' ప్రచార కార్యక్రమాన్ని వజ్రకరూర్‌లో ప్రారంభించినట్లు వైద్యాధికారి డాక్టర్ తేజస్వి తెలిపారు. ఈ కార్యక్రమం జూన్ 16 నుంచి జూలై 31 వరకు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుషిత నీరు, అపరిశుభ్రమైన ఆహారం కారణంగా డయేరియా వ్యాప్తి చెందే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ముఖ్యంగా ఐదేళ్లలోపు చిన్నారులు ఈ వ్యాధికి త్వరగా గురయ్యే అవకాశముందని చెప్పారు. గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంటిని రెండుసార్లు సందర్శించి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.డయేరియా బారిన పడినవారికి తరచుగా విరోచనాలు, వాంతులు కావడం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గిపోతుందని, వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వడం ద్వారా డీహైడ్రేషన్‌ను నివారించవచ్చని సూచించారు. సరైన సమయంలో చికిత్స అందకపోతే మూత్రపిండాల పనితీరు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. వైద్యుల సలహా లేకుండా యాంటీబయాటిక్ మందులు వాడరాదని, లక్షణాలు కనిపించిన వెంటనే ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు లేదా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన నీరు తాగడం, ఆహార పరిశుభ్రత పాటించడం ద్వారా డయేరియాను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మీదేవి, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, కుమారస్వామి, సూపర్‌వైజర్ నాగశంకర్, హెల్త్ అసిస్టెంట్లు నాగరాజు, సంపత్‌కుమార్, ఫార్మసిస్ట్ రామచంద్ర నాయక్, ఏఎన్‌ఎం లక్ష్మి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కడపలో ఏపీఎల్ క్రికెట్ సందడి..

**● జూన్ 17 నుంచి 21 వరకు 9 మ్యాచ్‌లు..**

**● తొలిసారిగా ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు**



**కడప మన జనప్రగతి జూన్ 16:**-కడపలోని వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో జూన్ 17 నుంచి 21వ తేదీ వరకు ఏపీఎల్ (ఆంధ్ర ప్రీమియర్ లీగ్) క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిటీ సభ్యుడు ఎం. భరత్ రెడ్డి తెలిపారు. ఈసారి తొలిసారిగా ఫ్లడ్‌లైట్ల వెలుగులో మ్యాచ్‌లు జరగనున్నాయని ఆయన వెల్లడించారు.మంగళవారం వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖపట్నం, కడప, మంగళగిరి వేదికలుగా ఏపీఎల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా కడపలో ఐదు రోజుల పాటు మొత్తం తొమ్మిది మ్యాచ్‌లు జరగనున్నాయని తెలిపారు. అనంతరం జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు మంగళగిరిలో మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో సుమారు 10 వేల మంది ప్రేక్షకులు మ్యాచ్‌లను వీక్షించే సామర్థ్యం ఉందని, క్రికెట్ అభిమానుల కోసం ఉచిత పాసులు అందుబాటులో ఉంచినట్లు భరత్ రెడ్డి తెలిపారు. కడపలో క్రికెట్ అభివృద్ధికి ఈ పోటీలు మరింత ఊతమిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏసీఏ సీఓఓ గిరీష్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మునికుమార్ రెడ్డి, కార్యదర్శి రెడ్డి ప్రసాద్, స్టేడియం కమిటీ కన్వీనర్ సంజయ్, ఏసీఏ పీఆర్ఓ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా షణ్ముఖరావు

**ఏకగ్రీవ తీర్మానం చేసిన సంఘ రాష్ట్ర నాయకులు**

**శివ రాజేష్, వంశీకృష్ణ, జోగినాయుడు**

**త్వరలోనే జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటన**

**షణ్ముఖరావు ఎన్నికపై హర్షం వ్యక్తం చేసిన పలు జర్నలిస్ట్ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు**





**శ్రీకాకుళం మన జనప్రగతి జూన్ 16:**-పాత్రికేయ వృత్తే పరమావధిగా నిజాయితీగా సేవలందిస్తున్న సిక్కోలు టుడే దినపత్రిక ఎడిటర్ గజ్జి షణ్ముఖరావును ఆంధ్ర ప్రదేశ్ జర్నలిస్టు ఫోరం (ఏపీ ఎంఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవ తీర్మానం చేస్తూ రాష్ట్ర కార్యవర్గం మంగళవారం ఉత్తర్వులు వెలువరించింది. ఏపీ జే ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి శివ రాజేష్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ మారెళ్ళ వంశీకృష్ణ, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జి శాసన జోగినాయుడు ఈ తీర్మానానికి ఆమోదం తెలిపారు. గజ్జి షణ్ముఖరావు గతంలో అనేక ప్రధాన పత్రికల్లోనూ వివిధ స్థాయిల్లో సేవలు అందించారు. గతంలో జాప్ జిల్లా అధ్యక్షుడిగా ఉంటూ పాత్రికేయుల సమస్యలపై, పాత్రికేయులు పై జరిగిన దాడులపై అనేక పోరాటాలు సాగించారు. ఈ సందర్భంగా నగరంలోని రెవెన్యూ అతిథి గృహంలో జరిగిన సమావేశంలో మంగళవారం జర్నలిస్ట్ జేఏసీ నాయకులు కాంక్యాన వేణుగోపాల్, శాసపు జోగినాయుడు, చింతపల్లి నాగ భూషణ్, గంజి ఆర్ ఎజ్రా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా షణ్ముఖరావుకు పూలమాల వేసి దుశాలువతో ఘనంగా సత్కరించారు. షణ్ముఖరావు మాట్లాడుతూ తన పట్ల ఎంతో నమ్మకంతో ఏపీ జె ఎఫ్ అందించిన ఈ బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తించి పాత్రికేయుల సమస్యలపై పోరాడుతానని తెలిపారు. షణ్ముఖరావు ఎన్నిక పట్ల పలు జర్నలిస్టు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఈ అభినందన సభలో జర్నలిస్టులు సీపాన రమేష్ బాబు...బలగమోహన్, రౌతు సూర్యనారాయణ, టెంక శీను, గుజ్జల సూర్యనారాయణ, బొమ్మిడి వేణుగోపాల్, బి కృష్ణారావు, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ప్రాజెక్టులు, భూసేకరణ

**జాతీయ రహదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ డా,, ఎస్. వెంకటేశ్వర్**




**తిరుపతి టౌన్ మన జనప్రగతి జూన్ 16:**- రైల్వే ప్రాజెక్ట్ పనులు,శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2, కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్పైపు లైన్ పనులు,ఏ డీబి రోడ్డులు, దుగ్గరాజపట్నం పనులు, కృష్ణపట్నం పోర్ట్, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి శ్రీ సిటీలోని ఎల్జి కంపెనీకి సంబంధించి పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులపై సమీక్షా పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్ధంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు తో కలిసి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో రైల్వే ప్రాజెక్ట్ పనులు,జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు, శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2,స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, అంశాలు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, ఏ డీబి రోడ్డులపై నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు , చెన్నై నేషనల్ హైవే పి డి లు, రైల్వే ప్రాజెక్టు అధికారి, సదరన్ రైల్వే అధికారి, తిరుపతి,నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎల్. శివకుమార్, టి టి డి ఎస్టేట్ అధికారి, ఎస్ ఈ ఇరిగేషన్ ,ఆర్ అండ్ బి ఎస్ ఈ,రాజా నాయక్, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారి, ఏపీఐఐసీ అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు,తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... శ్రీ సిటీ ఫేజ్ -2, ఏ పి ఐ ఐ సి లోని ఎల్ జి ఫేజ్ -1,2, 3 కొల్లాడం, ఇరుగుళం,పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, శ్రీ సిటీ ఫేజ్ -1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, , ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిస్కారం అయ్యేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్ పై వున్న సమస్యలను సత్వరమే పరిస్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, వి సి ఐ సి రోడ్డు, ఏ పి ఐ ఐ సి ప్రాజెక్ట్స్,వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైను పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు పురోగతిలో ఉన్న పనులపై నడికుడి - శ్రీకాళహస్తి, ఏర్పేడు - పూడి, గుమ్మడి పూండి-గూడూరు, గూడూరు-రేణిగుంట, తిరుపతి - కాట్పడి అర్కోణం - రేణిగుంట, సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను, దుగ్గరాజపట్నం, వేగవంతం చేయాలన్నారు. ఆరు లైన్ల రహదారులు నిర్మాణం, నాయుడుపేట-రేణిగుంట, , రేణిగుంట- కడప రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యత తో పనులు పూర్తి కావాలని అన్నారు. ఎయిర్పోర్ట్, ఇస్సేర్, కరకంబాడి, ఎమ్ ఐ జి లే అవుట్ తిమ్మాజికండ్రిగ, పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. అలాగే ఆర్ అండ్ బి , పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ ఫారెస్ట్, జల వనరుల శాఖ అధికారులు అందరూ కలసి సమన్వయంతో పెండింగ్ పనులను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్లు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.వడమాల పేట, ఏర్పేడు మండలాలలో పాదిరేడు అరణ్యం, పల్లం గ్రామాల నందు టీటీడీ ఉద్యోగస్తులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై కూడా త్వరిత గతిన చర్యలు తీసుకొని పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, తిరుపతి,సూళ్లూరుపేట ఆర్డీఓలు, రామ్మోహన్, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్ మాండ్, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అధికారి రాంప్రసాద్ సిటీ జనరల్ మేనేజర్ భగవాన్,సంబంధిత తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు , సెక్షన్ ఆధికారులు భాస్కర్, చైతన్య, శివప్రసాద్, భూసేకరణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మనజనప్రగతి
తెలుగు దినపత్రిక
17 - 06 - 2026

# యోగాతో సంపూర్ణ ఆరోగ్య భాగ్యం

### ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి

### గండికోటలో ఉత్సాహవంతంగా సాగిన పర్యాటక యోగాంధ్ర కార్యక్రమం

**జమ్మలమడుగు,మన జనప్రగతి జూన్ 16:-** యోగా తోనే సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్య భాగ్యం సిద్ధిస్తుందని.. దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని.. ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. 12 యోగాంధ్ర పక్షోత్సవాల్లో భాగంగా.. మంగళవారం పర్యాటక యోగా థీమ్ తో.. గండికోట చారిత్రక పర్యాటక క్షేత్రంలో.. జిల్లా పర్యాటక, ఆయుష్ శాఖల ఆధ్వర్యంలో వేలాది మంది పౌరులతో యోగా గురువులు యోగాసనాలు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ విప్,జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా విప్ మరియు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రాచీనకాలం నుండి యోగా సాధనతో.. ఎందరో మునులు,ఋషులు, యోగులు తపోనిష్ట సమయంలో.. అనారోగ్యాలు దరిచేరకుండా యోగాసనాలు, ప్రాణాయామాలు చేస్తూ సంపూర్ణ ఆరోగ్యాన్ని తమ సొంతం చేసుకున్నారని గుర్తు చేశారు.మానసిక సమస్యలకు,శారీరక రుగ్మతలకు యోగ మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని..యోగా ప్రాముఖ్యత,విశిష్టతను విస్తృతం చేస్తూ.. జూన్ 7 నుండి నుండి జూన్ 21 వరకు రాష్ట్ర ప్రభుత్వం "యోగాంధ్ర క్యాంపెన్ -2025" ను అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా మన జిల్లాలో కూడా యోగా చేయడం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విశదీకరిస్తూ.. జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు పౌరులకు యోగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పర్యాటక యోగ థీమ్ లో భాగంగా ఈ రోజు అత్యంత చారిత్రాత్మక ప్రదేశం అయిన గండికోట పర్యాటక క్షేత్రంలో నిర్వహించడం సంతోషించ దగ్గ విషయం అని,ఈ కార్యక్రమం నిర్వహణ జిల్లాకే గర్వకారణం అన్నారు. "హ్యాపీ ఆంధ్రప్రదేశ్ - హెల్తీ ఆంధ్రప్రదేశ్" అన్న నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో యోగాంధ్ర పేరుతో నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య భాగ్యాన్ని కల్పించాలనే ఉద్దేశ్యం తో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని మోటివేషనల్ ప్రోగ్రామ్ గా నిర్వహించడం జరుగుతోందన్నారు. యోగాసనాలు వేయడం ద్వారా..క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను



నిత్యజీవితంలో ఒక దిన చర్యగాఅలవర్చుకోవాలన్నారు.యోగాంధ్ర కార్యక్రమాల్లో జిల్లా యంత్రాంగం చేస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయం అన్నారు.ఈ రోజు పర్యాటక యోగా కార్యక్రమాన్ని జిల్లా లోని సుప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన గండికోట లో ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు.గండి కోట జిల్లాలోనే అత్యంత సుభిక్షమైన ప్రాంతం అని,ఇక్కడ ప్రవహించే పెన్నానది పుణ్యదాయకమైనదన్నారు. అందుకే.. ఈ జమ్మలమడుగు నియోజకవర్గ ప్రాంతం అన్ని రకాల వనరులతో రాష్ట్ర, దేశ ఆర్థిక ప్రగతికి మైలురాయిగా విలసిల్లుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ ను సుభిక్షం చేసే దిశగా అడుగులేస్తోందన్నారు. బనకచర్ల గోదావరి ప్యాకేజీ ద్వారా మన రాయలసీమకు నీరు అందిస్తే ఇక్కడి రైతాంగానికి,పారిశ్రామిక రంగానికి అంతకంటే భాగ్యం ఇంకొక్కటి ఉండదన్నారు. అత్యంత చారిత్రక వైభవం ఉన్న గండికోట ప్రాంతం పెన్నా నది తీరంలో సుభిక్షమైన వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు, పారిశ్రామిక వాడలకు ప్రత్యేక ఆకర్షణగా వెలుగిందుతోందన్నారు. సోలార్,వ్యాపార,పారిశ్రామిక రంగాలతో అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతానికి భవిష్యత్తులో ప్రపంచస్థాయి లో విశిష్టమైన గుర్తింపు లభిస్తుందని ఆకాంక్షించారు. పర్యాటక మ్యాపులో ఇప్పటికే ఒక విశిష్టమైన స్థానాన్ని సంపాదించిన



గండికోట.. పర్యాటకంగా మరిన్ని అభివృద్ధి పనులతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచనుందన్నారు.ఈ యోగా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ స్వీయ బాధ్యతగా స్వీకరించి.. సామాజిక ఆరోగ్య పరిరక్షణకు పాటు పడాలన్నారు.ప్రతి ఇంటి లోనూ ప్రతి గ్రామంలోనూ ప్రతి మండలంలోనూ ప్రాధాన్యతతో యోగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ యోగాంధ్ర మాసోత్సవాల్లో నేర్చుకున్న యోగా ఆసనాలను.. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి నిత్య జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్నిపురస్కరించుకొని జూన్ 21వ తేదీ వరకు జిల్లా యంత్రాంగం,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో జిల్లా ప్రజలు విస్తృతంగా పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్ డి ఓ శిరీష,జెడ్పి సీఈఓ సుబ్రహ్మణ్యం, డిఎంహెచ్ఓ డా. నాగరాజు,ఆయుష్ నోడల్ అధికారి రవికుమార్, టూరిజం అధికారి సురేష్ కుమార్,తహశీల్దార్ సాయినాథ్ రెడ్డి, జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, గండికోట గ్రామ ప్రజా ప్రతినిధులు ఈశ్వర్, జిల్లా అధికారులు,ఆయుష్ సిబ్బంది, పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, పెద్ద ఎత్తున మహిళలు,యువత పాల్గొన్నారు.

# వెన్నుపోటుదారుడు జగనే: మంత్రి సవిత

**ఏపీకి భవిష్యత్తు కూటమితోనే**

**గర్వపడేలా సీఎం చంద్రబాబు రెండేళ్ల పాలన**

**అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు రావాలి**

**జగన్ కు, వైసీపీ నాయకులకు మంత్రి సవిత సవాల్**

**పుట్టపర్తి/శ్రీసత్యసాయి మన జనప్రగతి జూన్ 16:-** ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో విధ్వంస పాలనతో ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసి చరిత్రలో వెన్నుపోటు దారుడిగా నిలిచిపోయారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత విమర్శించారు. కూటమి ప్రభుత్వంతోనే ఏపీ ప్రజల భవిష్యత్తుకు భరోసా లభిస్తోందని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధిపైనా, గత పాలనలో జరిగిన విధ్వంసంపైనా చర్చకు సిద్ధమని వైసీపీ నాయకులకు మంత్రి సవిత సవాల్ విసిరారు. పుట్టపర్తిలో మంగళవారం నిర్వహించిన రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు సహా పలువురు ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి, ఎంపీ బీకే పార్థసారథితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడానికి రేయింబవళ్లు కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో అత్యధిక శాతం ఏపీకే తరలొస్తున్నాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలుచేస్తూనే, రాజధాని అమరావతిని, పోలవరం ప్రాజెక్టు పనులను కూడా పూర్తి చేస్తున్నారన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం -2 పథకాలతో పాటు అధికారంలోకి రాగానే పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు తమ ప్రభుత్వం పెంచిందన్నారు. కూటమిలో ఉన్న పార్టీల కార్యకర్తలు గర్వపడేలా రెండేళ్ల పాలన సాగిందని మంత్రి సవిత తెలిపారు. **జగన్ అతిపెద్ద వెన్నుపోటుదారుడు** ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ విధ్వంస పాలన చేశారని మంత్రి సవిత మండిపడ్డారు. అమ్మఒడి, పెన్షన్ల పెంపు పేరుతో ప్రజలను జగన్ వెన్నుపోటు పొడిచారన్నారు. 2019 ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయడంలో జగన్ రెడ్డి విఫలమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే




సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రాధాన్యమిచ్చిందన్నారు. బీసీ సంక్షేమ శాఖ తరపున గతంలో కూడా అమలు చేయని ఎన్నో పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రభుత్వ విద్యా సంస్థలతో పాటు హాస్టళ్లు, గురుకులాల్లో ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాలు వచ్చాయన్నారు. వైసీపీ, కూటమి ప్రభుత్వాల అభివృద్ధిపై చర్చకు రావాలని జగన్ కు మంత్రి సవిత సవాల్ విసిరారు. ఏ శాఖపైనైనా, రాష్ట్రంలో ఏ నియోజక వర్గంలోనైనా చేపట్టిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టంచేశారు. **ఆనాడు మీ పీఆర్ శాఖ నిద్రపోయిందా..?** రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని పరుగుల పెట్టడంలో మంత్రి నారా లోకేశ్ కాలి గోటుకు కూడా జగన్ గాని, ఆయన పార్టీ నాయకులుగాని సరిపోరని మంత్రి సవిత అన్నారు. 2014-19లో రాష్ట్రంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా నారా లోకేశ్




గ్రామాల్లో విస్తృతంగా రహదారులు నిర్మించారన్నారు. ప్రస్తుతం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పీఆర్ మంత్రిగా పంచాయతీల్లో రోడ్లు నిర్మిస్తున్నారన్నారు. 2019-24 మధ్య ఒక్క రోడ్డు కూడా వేయలేదన్నారు. ఆనాడు ప్రభుత్వంలో పీఆర్ శాఖ నిద్రపోయిందా..? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత రాష్ట్రంలో అన్ని గ్రామాల్లోనూ, పంచాయతీల్లోనూ బీటీ, సిమ్మెంట్ రోడ్లను విస్తృతంగా చేపట్టామన్నారు. కూటమి పాలనతోనే రాష్ట్రాభివృద్ధి అని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. కూటమిలో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో జరిగే ఏ ఎన్నికల్లోనైనా కూటమి మద్దతుదారులే గెలవాలని మంత్రి సవిత ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలొచ్చారు.

# బీసీ బాలికల విద్యకు భరోసా: మంత్రి సవిత



**6 ఎంజేపీ స్కూళ్లను కళాశాలలుగా అప్ గ్రేడ్**

**జీవో జారీచేసిన కూటమి ప్రభుత్వం**

**ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం**

**ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ తరగతుల్లో అడ్మిషన్లు**

**ఒక్కో గ్రూపులో 40 మంది విద్యార్థినులకు అవకాశం**

**ఎంజేపీ బాలికల స్కూళ్లను కళాశాలలుగా అప్ గ్రేడ్ పై మంత్రి సవిత హర్షం**

**సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు**

**అమరావతి మన జనప్రగతి జూన్ 16:-** బీసీ బాలికల విద్యను ప్రోత్సహిస్తూ కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆరు మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విజయనగరం జిల్లాలోని కొత్తవలస (బాలికల), ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని గోలగముడి, అన్నమయ్య జిల్లాలోని కలికిరి (బాలికల), వైఎస్సార్ కడప జిల్లాలోని ఓనిపెంట (బాలికల), ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు (బాలికల), శ్రీ సత్యసాయి జిల్లాలోని నాసనకోట (బాలికల) ఎంజేపీ గురుకులాల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా ప్రభుత్వం అప్ గ్రేడ్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రారంభమైన నూతన విద్యా సంవత్సరం నుంచి ఈ ఆరు గురుకుల కళాశాలల్లో మొదటి ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ప్రారంభం కానున్నాయన్నారు. ఒక్కో గ్రూపులో 40 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించనున్నట్లు తెలిపారు. ఒక్కో గురుకుల కళాశాలలో ఎనిమిది అధ్యాపకులను పార్ట్ టైమ్ పద్ధతిలో నియమించనున్నామన్నారు. వారితో ఒక కుక్ ను, ల్యాబ్ అసిస్టెంట్ ను అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించనున్నట్లు తెలిపారు. ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు కళాశాల ప్రిన్సిపాళ్లగా అప్ గ్రేడ్ చేస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. **సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు**బీసీ బాలికల విద్యకు ప్రోత్సహిస్తూ ఆరు గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేయడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. ఎంజేపీ గురుకులాల విద్య కోసం విద్యార్థులకు, వారి తల్లిదండ్రుల నుంచి విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. నాణ్యమైన విద్య, భోజనం, వసతి సౌకర్యాలు లభిస్తుండడంతో, రాష్ట్ర వ్యాప్తంగా ఎంజేపీ గురుకులాల్లో విద్యనభ్యసించడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారన్నారు.

# ఆర్ఎంపీ క్లినిక్‌లపై ఆకస్మిక తనిఖీలు

- **నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు**
- **వైద్యాధికారి డా.గవాస్కర్ రెడ్డి హెచ్చరిక**




**తొండూరు మన జనప్రగతి జూన్ 16:-**జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. గవాస్కర్ రెడ్డి తొండూరు, మల్లెల గ్రామాల్లోని ఆర్ఎంపీ ప్రథమ చికిత్స కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్లినిక్‌లలో అమలవుతున్న వైద్య సేవలు,సౌకర్యాలు, మందుల వినియోగంపై సమగ్రంగా పరిశీలించారు.ఆర్ఎంపీలు ఇంజెక్షన్లు వేయడం, ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించడం, పేరుకు ముందు "డాక్టర్" అని పేర్కొనడం, అధిక మోతాదులో మందులు లేదా స్టెరాయిడ్లు వినియోగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని డా. గవాస్కర్ రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.క్లినిక్‌లలో ఉన్న మంచాలు, మందుల నిల్వలు, ఐవీ స్టాండ్లు, బోర్డులు తదితర అంశాలను పరిశీలించిన ఆయన, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా వైద్య సేవలు అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అన్ని క్లినిక్‌లలో ప్రదర్శించిన నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.ఈ తనిఖీ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మల్లయ్యతో పాటు స్థానిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174